

- టీడీపీ అధికారంలోకి రాగానే పరార్!
- కావలిలో వైసీపీ నాయకులే బినామీ కాంట్రాక్టర్లు
- ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకనే బిల్లులు?
- నగదు మొదలు మెటీరియల్ దాకా చేతివాటం
- కొత్త ప్రభుత్వం రాగానే మిగిలిన మెటీరియల్ కూడా మాయం
- నాయకులు, కాంట్రాక్టర్లు కనుమరుగు
- జరిగిన అవినీతిపై నివేదిక కోరిన ఎమ్మెల్యే కావ్య
- ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని అధికారుల్లో వణుకు

జగనన్న కాలనీ

భోక్తల జంప్!

జగనన్న ప్రభుత్వంలో పేదవాడికి సొంతింటి కల దేవుడెరుగు పేదల పేరు చెప్పి వైసీపీ నాయకులు మాత్రం అందినకాడికి దండుకున్నారనే చేదు నిజాలు వెలుగుచూస్తున్నాయి. కావలిలో జగనన్న కాలనీల పేరుతో తక్కువ ధరకు రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించి భారీ కుంభ కోణానికి తెరతీసిన సంగతి తెలిసిందే. అలాగే భూముల లెవలింగ్ పేరుతోనూ రూ.కోట్లు దండుకున్నారు. ఇది చాలదన్నట్టు వైసీపీ నాయకులే బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అంతటితో ఆగక ప్రభుత్వం సరఫరా చేసిన నిర్మాణ సామగ్రిలోనూ చేతివాటం ప్రదర్శిం చారు. నాసిరకంగా అరకొరగా ఇళ్ల నిర్మాణంతోపాటు బిల్లులు చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సదరు కాంట్రాక్టర్లంతా పత్తాలేకుండా పోయారు. కాలనీల్లో ఉన్న కొద్దిపాటి మెటీరియల్‌ను కూడా రాత్రికిరాత్రే తరలించినట్లు సమాచారం. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఇళ్ల నిర్మాణంపై సమగ్ర నివేదిక కోరడంతో అధికారుల్లో వణుకు మొదలైంది.

కావలి, జూన్ 25 : కావలి పట్టణంలోని ముసునూరు వద్ద జగనన్న కాలనీలో 6,741 ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఏ ఒక్కటి పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించలేదు. మంజూరైన 6,741 ఇళ్లలో 2,053 పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. మిగిలిన ఇళ్లలో 2,385 ఇళ్లు స్లాబ్‌లెవల్, 612 ఇళ్లు రూఫ్‌లెవల్, 25 ఇళ్లు లెంటిల్ లెవల్, 1062 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్, 102 ఇళ్లు ఫింత్‌బీమ్ లెవల్, 474 ఇళ్లు బిలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. ఇంకా 27 ఇళ్ల నిర్మాణానికే నోచుకోలేదు. అయితే ఈ ఇళ్ల మినహా మిగతా ఇళ్లకు రెండు దశలలో అవసరమైన స్టీలు, సిమెంట్, ఇసుకను గృహ నిర్మాణ శాఖ అందచేసింది.



ముసునూరులోని మెగా లేఅవుట్‌లో వివిధ దశల్లో ఉన్న జగనన్న ఇళ్లు



● వైసీపీ నేతలే బినామీలుగా..

వైసీపీ నేతలే బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తి ఇళ్ల నిర్మాణాలను చాలా వరకు నాసిరకంగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి సెంటు భూమి మాత్రమే ఇవ్వడంతో లబ్ధిదారులు ఎవరూ మక్కువ చూపలేదు. దీంతో ప్రభుత్వమే కట్టించి ఇస్తామని ప్రకటిం చడంతో ఇళ్ల నిర్మాణాలను వైసీపీ నేతలకు అప్పగించారు. ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలతోపాటు పొదుపు సంఘం నుంచి సభ్యులు రూ.30 వేల వరకు రుణం తీసుకోవచ్చు. అయితే, ఇదంతా కాంట్రాక్టరు ఖాతాకు జమవుతుంది. ఈ చాలీచాలని నిధుల లోనూ వైసీపీ నేతలు చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వం సరఫరా చేసిన స్టీల్, సిమెంట్‌లలో కొంత బయట మార్కెట్‌కు తరలించారు. తూతూమంత్రంగా నిర్మించిన ఇళ్లు కూడా కొద్దిపాటి వర్షానికే పడిపోవటంతో అప్పట్లో విజిలెన్స్ విచారణ కూడా జరిగింది. అయితే, నిర్మాణాలు చేపట్టిన వారంతో వైసీపీ నేతలే కావటంతో జరిగిన అక్రమాలు బయటకు రాకుండా పాలకులు తొక్కిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఇళ్ల నిర్మాణాలో వేగం లేకపోవడంతో వైసీపీకి చెందిన ముగ్గురు బడా కాంట్రాక్టర్లను రంగంలో దించారు. వారు కూడా నిర్మిణాలను నాసిరకంగా చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

● రాత్రికిరాత్రే మెటీరియల్ మాయం

ఇళ్ల నిర్మాణాలకు స్టీలు, సిమెంట్, ఇసుక ఎంత ఇచ్చారు? వాటిలో ఎంత వినియోగించారో అర్థం కాని పరిస్థితి. బేస్‌మంట్ వరకు ఒకసారి ఆ తర్వాత మరోసారి నిర్మాణ సామగ్రిని కాంట్రాక్టర్లకు అందజేశారు. అయితే మెటీరియల్ వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచే కాంట్రాక్టర్లు నిర్మాణాలు ఆపేసినా అధికారులు పట్టించుకోలేదు. కౌంటింగ్ అనంతరం ప్రభుత్వం మారటంతో జగనన్న కాలనీలో మిగిలిన మెటీరియల్‌ను కూడా రాత్రికి రాత్రే తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులు ముందుగానే బిల్లులు చెల్లించి ఆ నిధులతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా కొందరికి సహకరించారు. ఇలా నగదు తీసుకున్న వారు కూడా పత్తాలేకుండా పోయారు.

● అధికారుల్లో వణుకు


కావలి ఎమ్మెల్యేగా గెలుపొందిన దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో అధికారుల్లో వణుకు మొద లైంది. గత నెలలో గృహ నిర్మాణ శాఖ డీఈ పదవీవిర మణ చెందగా ఈ నెలలో ఈఈ పదవీవిరమణ చెందనుండటంతో జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి అక్రమాలు వెలికి తీయడం సాధ్యపడదనే ప్రచారం నడుస్తోంది. ఒకవేళ ఉన్నతాధికారుల జోక్యంతో అక్రమాలు బయటకు వస్తే వాటికి క్షేత్రస్థాయి సచివాలయ ఇంజనీరింగ్ కార్యదర్శులను బాధ్యులను చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



ఇది ఎవరి పని!?

బోగోలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళ వారం వందల కొద్దీ సిమెంటు బస్తాలు పడేసి ఉండటం కలకలం రేగింది. దీనిపై ఆరాతీస్తే ఆ సిమెంట్ బస్తాలన్నీ జగనన్న కాలనీలకు చెందినది తేలింది. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల కోసం 2023లో ప్రభుత్వం నుంచి సిమెంట్ బస్తాలు సరఫరా అయ్యాయి. వీటిని స్థానికంగా లభ్యమయ్యే గోదాములలో నిల్వ ఉంచి, అవసరమైన మేరకు కాలనీలకు సరఫరా చేశారు. అయితే, ఓ గోదాములో నిల్వ ఉంచిన బస్తాలు వర్షాలకు తడిచిపోయి, గడ్డలు కట్టాయి. మంగళవారం ఇది వెలుగులోకి రావడంతో ఆ బస్తాలను ఎమ్పీడీవో కార్యాలయ ఆవరణలోకి తరలించారు. దీనిపై గృహనిర్మాణ శాఖ ఏఈ రంగవరప్రసాద్‌ను వివరణ కోరగా గడ్డకట్టిన సిమెంట్ బస్తాలపై ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

- బిట్రగుంట



రామలింగేశ్వరుడి ఆలయం

రామతీర్థానికి బ్రహ్మోత్సవ శోభ!

- నేటి నుంచి రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు
- 4న కల్యాణం, 5న తీర్థవాది, భక్తులకు విస్తృత ఏర్పాట్లు

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తు లు తరలిరానుండటంతో ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

● శివతత్వాన్ని తెలిపేలా...

బ్రహ్మోత్సవాల్లో స్వామివారు శివతత్వాన్ని ప్రజలు తెలియచేసేలా వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. ఈనెల 26న అంకు రార్పణతో ప్రారంభయ్యే ఈ ఉత్సవాలు వచ్చేనెల 6న జరిగే ధ్వజావరోహణతో ముగుస్తాయి. 27న ధ్వజారో హణ, 28న చిలక వాహనం, 29న హంసవా హనం, 30న పులివాహనం, 1న రావణసేవ, 2న నందిసేవ, 3న రథోత్సవం, 4న కల్యాణం, గజవాహణ సేవ, 5న తీర్థవాది (సముద్రస్నానం), తెప్పోత్సవం, పారువేట, అశ్వవాహన సేవ, 6న ధ్వజావరోహణం, ఏకాంతసేవ నిర్వహిస్తారు. ప్రారంభ, ముగింపు రోజుల్లో పల్ల వుల కాలం నాటి 200 కిలోల కంచు గంటను మోగిస్తారు. కాగా స్వామి, అమ్మ వార్ల కల్యాణానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. కల్యాణం మరుసటి రోజు స్వామివారికి సముద్రస్నానం చేయిస్తారు. దీన్నే తీర్థవాది అని పిలుస్తారు.ఆ రోజున స్వామివారితో కలసి లక్షలాది మంది భక్తులు సముద్రస్నానం ఆచరిస్తారు.

సమన్వయంతో నిర్వహణ

రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతోపాటు దాతలు, భక్తులు, అధికారులను సమన్వయం చేసుకుని విజయవంతం చేయడానికి ప్రయత్నిస్తాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్ని మాపక శాఖ అధికారులతో సమీక్షించాము.

- జీ రామకృష్ణ, ఆలయ ఈవో

● 5న తెప్పోత్సవం

వచ్చే నెల 5వ తేదీన తెప్పోత్సవం జరగనుంది. ఉభయకర్తలుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వ్యవహరించను న్నారు. గతంలో ఈ ఉత్సవానికి ఉభయకర్తగా ఊటుకూరు గ్రామానికి చెందిన కలిసేటి వెంకారెడ్డి ఉండేవారు. ఆయన స్వర్గస్తులు కావడంతో నాలుగేళ్లుగా దేవ దాయ శాఖ అధికారులే నిర్వహించేవారు. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్వామివారు ఊరేగే వాహనాలను అందంగా ముస్తాబు చేశారు. తాత్కాలిక గదులు, మరుగు దొడ్లను ఏర్పాటు చేశారు. నెల్లూరు, కావలి నుంచి రామతీర్థానికి ప్రత్యేక బస్సు లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

నర్రవాడలో భక్తజనం

వైభవంగా వెంగమాంబ గ్రామోత్సవం ● నేడు కల్యాణం, ప్రధానోత్సవం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 25 : భక్తజనంతో నర్రవాడ గ్రామం కిక్కిరిసిపోతోంది. ఇక్కడ జరుగుతున్న వెంగమాంబ పేరంటాల బ్రహ్మో త్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహ నంపై పేరంటాలమ్మ, గురవయ్యనాయుడు దంపతులు ఊరేగుతూ భక్తులకు ద ర్శనమిచ్చారు. సంతానంలేని మహిళలు ఉపవాసదీక్షతో వెంగమాంబ పేరంటా లను వరపడి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయం నుంచి గ్రామోత్సవం మొదలై నర్రవాడ, గుడేవారిపాళెం, ఉలవారిపాళెం, బీసీ కాలనీల మీదుగా సాగింది. తొలుత నర్రవాడలో ఉత్సవ విగ్రహాలకు వెంగమాంబ వంశీయులు వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం చేయించారు. స్వామివార్లకు పులివర్తి వంశీయులు పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, బుధవారం వెంగమాంబ దంపతుల కల్యా ణం, రాత్రి ప్రధానోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ ఉ త్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

● భారీ బందోబస్తు



గ్రామోత్సవానికి తరలివస్తున్న ఉత్సవమూర్తులు

బ్రహ్మోత్సవాల్లో ప్రధా న రోజులైన బుధ, గురు వారాల్లో భారీసంఖ్యలో భక్తులు తరలిరానుండ టంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉదయగిరి సీఐ వీ.గిరి బాబు, ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు 15, హెడ్ కానిస్టేబుళ్లు 56, కానిస్టేబుళ్లు 97, హోంగార్డులు 83 మంది, 30 మంది స్పెషల్, ఏఆర్ పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.

కరెంటు కనెక్షన్‌కు అర లక్ష లంచం

ఏసీబీ వలకు చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ ● అదుపులోకి సిబ్బంది, ఫైళ్లు స్వాధీనం ● అవినీతి అధికారి ఇళ్లలో సోదాలు



ఏఈ శివశంకరయ్య

నెల్లూరు రూరల్, జూన్ 25 : ఓ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అక్షరాలా అరలక్ష లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ ఏఈని అవినీతి నిరోధక శాఖ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. హరిప్రసా ద్ అనే వ్యక్తి నుంచి నెల్లూరు రూరల్‌లోని ఆర్-2 (పడమరగ్రామాలు) సెక్షన్‌కు ఏఈగా పని చేస్తున్న వై శివశంకరయ్య రూ.50 వేలు లం చం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. కొత్తూరు సమీపంలోని కావేరి నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళ వారం ఈ సంఘ టన చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు... అనంతసాగరానికి చెందిన హరిప్రసాద్ నెల్లూరు రూరల్ పరిధిలోని ఓగూరుపాడు వద్ద ఇంటికి విద్యుత్ మీటరు అవసరమై అధికారులను సంప్రదించాడు. కనెక్షన్ ఇచ్చేందుకు రూ.80 వేలు ఇవ్వాలని ఏఈ శివశంకరయ్య కోరాడు. దీంతో అవినీతి బాగోతాన్ని హరిప్రసాద్ ఏసీబీ డీఎస్పీ శిరీష దృష్టికి తీసుకువెళ్లాడు. ఆమె సూచనలతో బాధితుడు రూ.50 వేలు లంచం ఇస్తుండగా అవినీతి అధికారిని ఏసీబీ బృందం పట్టుకుంది.

వసూళ్లకు ఏజెంట్

ఏఈ శివశంకరయ్య తన ఉద్యోగంతోపాటు ఆ శాఖలోనే కాంట్రాక్టరుగానూ వ్యవహరిస్తున్న ట్లు తెలిసింది. సన్నిహితుడైన ఓ వ్యక్తిని తెరపైకి చూపి కాంట్రాక్టు పనులన్నీ నిర్వహిస్తున్న ట్లు సమాచారం. అంతేకాదు తన అవినీతి సామ్రాజ్యానికి ఏజెంట్లను నియమించుకు న్నాడు. విద్యుత్ సంబంధ పనులకు ప్రజలనుంచి అవినీతి సొమ్ము తీసుకునేందుకు ప్రాంతాల వారీగా ఆయనకు ప్రైవేట్ సైన్యం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే కావేరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో డబ్బు వసూలు చేసేందుకు ఓ ఆపరేటర్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడని సమాచారం. అయితే మంగళ వారం ఆ వ్యక్తి అందుబాటులో లేనందున శంకరయ్యే స్వయంగా నగదు తీసుకునేందుకు వచ్చి ఏసీబీకి చిక్కినట్లు తెలిసింది. ఏసీబీ అధికారు లు సబ్‌స్టేషన్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, కార్యాలయంలోని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఏఈ సొంతూరైన వెం కటగిరిలో, ప్రస్తుతం నివాసముంటున్న నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లోనూ ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదా లు నిర్వహించినట్లు సమాచారం. కాగా, ఏఈ శివశంకర య్యపై ఏప్రిల్ 15 నుంచి ఏసీబీ అధికారులకు వరుస ఫి ర్యాదులు అందుతున్నాయి. స్పష్టమైన ఆధారం కోసం అ న్వేషిస్తున్న సమయంలో బాధితుడు హరిప్రసాద్ ఏసీ బీని ఆశ్రయించడంతో వలపన్ని అవినీతి చేపను పట్టు కున్నారు. మంగళవారం రాత్రి వరకు కావేరినగర్ సబ్ స్టేషన్‌లోనే ఫైళ్లను పరిశీలిస్తున్న అధికారులు, శివశంక రయ్యపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరచనున్నారు.



రయ్.. రయ్... రైల్వే స్టేషన్

● వేగంగా నెల్లూరు ప్రధాన స్టేషన్ అభివృద్ధి

నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రూ.102 కోట్లతో జరుగుతున్న అభివృ ద్ధి పనులు వేగంగా సాగుతున్నా యి. 36మీటర్ల ఎయిర్ కాన్కోర్స్ నిర్మాణం, డెక్ స్లాపు కాంక్రీట్ పూర్తి అయ్యాయి. తూర్పువైపు నుంచి సబ్‌వే నిర్మాణం పూర్తి కావస్తోంది. ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ, నూతన షెడ్ నిర్మాణం 90శాతం పూర్తయ్యా యి. తూర్పు, పడమర వైపు మూడు అంతస్తుల నూతన భవనాల నిర్మాణం కూడా పూర్తికావస్తోంది. నెల్లూరు స్టేషన్ పునరాభివృద్ధి పనులపై దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటి వరకు 85శాతం పనులు పూర్తయినట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం)



సా...గుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులు

జిల్లాలో సమస్యగా మారిన భూసేకరణ

ఐదేళ్లుగా ముందుకు పడని అడుగు

ఎకరాకు రూ.3.75 లక్షల పరిహారమట!

భూముల అప్పగింతకు ముందుకు రాని రైతులు

పాలకులు దృష్టి సారిస్తే కల సాకారం

మెట్టలో రైలు కూత

ఎప్పటికో..!


నెల్లూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంతంలో రైలు కూత ప్రజల కలగానే మిగిలిపోతోంది. ఏళ్లు గడుస్తున్నా నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ మాత్రం పూర్తి కావడంలేదు. 2011-12 రైల్వేబడ్జెట్‌లో ఈ రైల్వేలైన్‌ను ప్రతిపాదించినా ఇప్పటికీ జిల్లాలో భూసేకరణ పూర్తి కాలేదు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో ఈ రైల్వేలైన్ పనులు వేగం పుంజుకున్నాయి. అప్పటి ప్రభుత్వం కృషితో 2016 ఆగస్టులో ఈ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2,289 కోట్లు మంజూరు చేసింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా కొంతవాటాను భరించేందుకు ఒప్పుకుంది. ఈ మేరకు భూసేకరణకు నిధులను కూడా సమకూర్చింది. దీంతో పనులు వేగంగా జరిగాయి. అప్పట్లోనే నడికుడి-పిడుగురాళ్ల మధ్య 21 కిలోమీటర్లు, పిడుగు రాళ్ల-శావల్యాపురం మధ్య 45 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ పూర్తయింది. అలానే గుండ్లకమ్మ నుంచి దర్శి వరకు, దర్శి నుంచి కనిగిరి వరకు దశల వారీగా రైల్వేలైన్ పనులు పూర్తి చేశారు. కానీ వెంకటగిరి - కనిగిరి మధ్య మాత్రం పనులు జరగలేదు. ప్రణాళిక ప్రకారం రెండో దశలో వెంకటగిరి-ఆల్తూరుపాడు మధ్య 41.95 కిలోమీటర్లు, మూడో దశలో ఆల్తూరుపాడు- వెంకటాపురం మధ్య 95.55 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ పూర్తి కాలేదు. అసలు ఇంతవరకు జిల్లా పరిధిలో భూసేకరణ కూడా పూర్తి చేయకపోవడం గమనార్హం. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఒకటి ఉందన్న విషయాన్ని కూడా మరిచిపోయింది. తన వాటా నిధులు సమకూర్చక పోవడం, భూసేకరణను పట్టించుకోకపోవడంతో రైల్వేశాఖ కూడా నిస్సహాయస్థితిలో ఉండిపోయింది.

జిల్లాకు ఎంతో ప్రయోజనకరం

ప్రస్తుతం జిల్లాలో గూడూరు-విజయవాడ రైల్వే లైన్ ఒకటే ప్రధానంగా ఉంది. ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు ప్రాంతాలకు రైలు సదుపాయం లేదు. గూడూరు-విజ యవాడ మధ్య ఏదైనా అంతరాయం ఏర్పడితే రైళ్లు వెళ్లేందుకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఈ నేపథ్యంలో నడికుడి-శ్రీకా ళహస్తి రైల్వే లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు జరిగాయి. ఈ మార్గం పూర్తయితే కొత్తగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పది లక్షలమందికి రైలు ప్రయాణ సౌకర్యం కలుగుతుంది. అలాగే తిరుపతి-హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుంది. ఉమ్మడి జిల్లాలో వింజమూరు, ఆత్మకూరు, ఓబులాయపల్లి, వెంకటాపురం, ఆదూరుపల్లి, రాపూరు, వెల్లంపల్లి, ఆల్తూరుపాడులో రైల్వే స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.

● ఎకరాకు రూ.3.75 లక్షలట!

జిల్లా పరిధిలో నెల్లూరు, ఆత్మకూరు డివిజన్లలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులకు భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ సుమారుగా పదేళ్ల నుంచి కొనసాగుతూనే ఉంది. అయినా ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఒక్క నెల్లూరు డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు మండలాల్లోనే 174.77 ఎకరాలను రైల్వేలైన్ కోసం సేకరించాల్సి ఉంది. ఈ భూసేకరణ గత టీడీపీ ప్రభుత్వం లో వేగంగా జరిగింది. 2018లో ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు భూసేకరణ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే అప్పట్లో అధికారులు ఎకరా విలువను చాలా తక్కువగా లెక్కించారు. బహిరంగ మార్కెట్ ధరలో ఇది సగం కూడా లేకపోవడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ఒప్పుకోలేదు. రాపూరు మండలం ఆదూరుపల్లి గ్రామాన్ని పరిశీలిస్తే ఇక్కడ ఒక్కో ఎకరానికి రూ.3.75 లక్షల చొప్పున ఇచ్చేలా నిర్ణయించారు. ఇది స్థానిక మార్కెట్ ధరతో పోలిస్తే చాలా తక్కువ. అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉంది. దీంతో రైతులు అభ్యంతరాలు తెలపడంతో వాటిని 2019లో అధికారులు పరిశీలనకు తీసుకున్నారు. కానీ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం దీన్ని గురించి పట్టించుకోక పోవడంతో భూసేకరణ ఆగిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ ఆ ప్రక్రియలో కదలిక వచ్చింది. వారం రోజుల క్రితం రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో భూములిచ్చే రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశమ య్యారు. ప్రాజెక్టు ఆవశ్యతను వివరించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. కానీ రైతులు మాత్రం నష్టపరిహారం విలువ పెంచాలని అధికారులకు విన్నవించుకున్నారు. పరిహారం పెంచే వరకు భూములిచ్చేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరముంది. రైతులకు నష్టం లేకుండా మార్కెట్ ధరను ప్రభుత్వం నుంచి ఇప్పించగలిగితే భూసేకరణ వేగంగా పూర్తికానుంది.



శ్రీకాళహస్తి- నడికుడి రైల్వేలైను రేఖాచిత్రం

వైసీపీ భవంతులను స్వాధీనం చేసుకోవాలి

● జనసేన జాతీయ మీడియా ప్రతినిధి అజయ్



వైసీపీ నిర్మిస్తున్న భవనం ముందు నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

నెల్లూరు (వెంకటేశ్వ రపురం), జూన్ 25 : పేదల టిడ్కో నివాసాల కోసం సేకరించిన భూముల్లో వైసీపీ నిర్మించిన భారీ భవంతులను వెంట నే ప్రభుత్వానికి అప్పగించాలని జనసేన జాతీయ మీడియా ప్రతి నిధి అజయ్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని భగత్ సింగ్‌కాలనీ వద్ద నిర్మిస్తున్న రాజమహల్ ను (వైసీపీ జిల్లా కార్యాలయం) మంగళవారం జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ భవంతిని కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ పేదలకు సెంటు స్థలం ఇవ్వడానికి 66 వంకలు పెట్టి చివరికి పూర్తిస్థాయిలో ఇవ్వకుండా ఐదేళ్లు పూర్తిచేసుకొన్న వైసీపీ నాయకులు తమ పార్టీ కార్యలయానికి మాత్రం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా కొట్టేశారని మండిపడ్డారు. వెంటనే ఈ భవంతిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, శ్రీరామ్, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నెల్లూరు (విద్య), జూన్ 25 : జులై 1 నుంచి అమల్లోకి రానున్న నూతన చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసులతో అదనపు ఎస్పీలు జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి మాట్లాడారు. చట్టాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ప్రతి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కేసులు దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలని, నియమాలను పాటించి ముద్దాయిలకు శిక్ష పడేలా చేయాలని ఆదేశించారు. అనంతరం లీగల్ అడ్వయిజర్ కొత్త, పాత చట్టాలలో మార్పులు చేర్పులను క్షుణ్ణంగా వివరించి సందేహాలను నివృత్తి చేశారు. అలాగే ఈ సాక్ష్యా యాప్, సంకలన్ యాప్‌ల గురించి తెలియచేశారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీలు సౌజన్య (అడ్మిన్), ప్రసాద్ (క్రైమ్స్), లీగల్ అడ్వయిజర్ శ్రీనివాసులరెడ్డి, సైబర్ సీఐ హుస్సేన్ బాషా, ఐ.సురేష్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించండి



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న జేసీ

నెల్లూరు (వైద్యం) జూన్ 25 : డయేరియా బాధపడుతున్న గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నెల్లూరులోని జీజీహెచ్ వైద్యులకు జాయిం ట్ కలెక్టర్ సేదు మాధవన్ సూచించారు. తిరుపతి జిల్లా గూడూరు మండలం లోని చెన్నూరు గిరిజన హాస్టల్ విద్యార్థులు డయేరియాతో బాధపడుతూ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఇక్కడున్న 10 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పిల్లలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు డీఎంహెచ్‌వోలు శ్రీహరి, పెంచలయ్య, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ కళారాణి, డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆ ఫొటోలెందుకు ?



మీరు చూస్తున్న ఈ ఫొటో మనుబోలు సచివాల యం-2 పక్కన ఉన్న ఆర్‌బీకేపై ఉన్నది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి 15రోజులైంది. అయితే ఇంకా ఆర్‌బీకే బోర్డుపై మాజీ సీఎం జగన్, మాజీ వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్థన్ రెడ్డిల ఫొటోలు దర్శన మిస్తున్నాయి. పిల్లిపెసర విత్తనాలు తీసుకునేందుకు మంగళవారం అక్కడికి వచ్చిన రైతులు, టీడీపీ నాయకులు ఈ ఫొటోను చూసి నివ్వెరపోయారు. మాజీల ఫొటోలను అధికారులు ఇంకా ఎందుకు తొలగించలేదని వారు ప్రశ్నించారు.

- మనుబోలు

ఇసుక అక్రమ తరలింపుపై విచారణ



ఇసుక తరలింపుపై గ్రామంలో విచారణ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

సంగం, జూన్ 25: మక్తాపురం వైసీపీ నాయకుల ఇసుక అక్రమ తరలింపుపై మంగళవారం అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. అంతకుముందు తహసీల్దారు రమాదేవి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తన క్షేత్రస్థాయి సిబ్బందితో వెళ్లి అక్రమార్కులు ధ్వంసం చేసిన పెన్నా పొర్లుకట్టలు, ఇసుక రీచ్‌ను పరిశీలించారు. వైసీపీ నాయకుల ఇసుక దోపిడీపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ విషయం పత్రికల్లో కథనాలు రావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. ఇక నుంచి అక్రమంగా ఇసుకను తరలించకుండా స్థానిక రెవెన్యూ సిబ్బందితో పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఇసుక, పొర్లుకట్టల మట్టిని తరలించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్, వీఆర్ఏలు, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాఘవేంద్ర మృతదేహం

కావలిరూరల్, జూన్ 25: కావలి పట్టణం ట్రంక్‌రోడ్డులోని నమస్కార్ హోటల్ ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడు మండలం కొల్లూరు పాడుకు చెందిన కోటి శివశంకర్ తన మేన మామ సాలి రాఘవేంద్ర (39)తో కలసి కొడవలూరు మండలం రాజుపాలెం వద్ద ఓ మామిడి తోటను చూసేందుకు మోటారు సైకిల్‌పై బయలుదేరారు. వీరు మార్గమధ్యంలో కావలి ట్రంక్‌రోడ్డులోకి వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ మోటారుసైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మోటారు సైకిల్‌తోపాటు ఆ ఇద్దరు యువకులు కింద పడగా మోటారు సైకిల్ వెనుక కూర్చున్న సాలి రాఘవేంద్రపై లారీ దూసుకెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. మోటారుసైకిల్ నడుపుతున్న శివశంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణం లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రాఘవేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో ఆసుప త్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంబేడ్కర్ తెలిపారు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6832
వెండి కిలో ధర	రూ. 91,000
వెండి ఒక గ్రాము	రూ. 93.00

'రైతు బంధు' చేరువయ్యేనా!?

గత ప్రభుత్వంలో మహత్తర పథకం నిర్వీర్యం


రుణాలు ఇవ్వకుండా కాలయాపన ● ఏఎంసీల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

అనుమతులు ఇవ్వని వైసీపీ సర్కారు

కొత్త ప్రభుత్వంపై కర్షకుల ఆశలు



ఆత్మకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



కావలిలోని ఏఎంసీ గోదాములు

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 25 : పంటల సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. అయినా ఆశచావని అన్నదాతలు అప్పోసప్పో చేసి వ్యవసాయం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడ్డా ఆశించినరీతిలో దిగుబడులు రాకపోగా, వచ్చిన అరకొర పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి సందర్భంలో వారిని ఆదుకునేందుకు గతంలో రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. రైతు తన పంటను గోదాముల్లో దాచుకుని వడ్డీలేని రుణాలు పొందేవారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. దీనిపై ప్రశ్నించాల్సిన వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించాయి. ఐదేళ్లుగా రుణాల కోసం ఏఎంసీల చుట్టూ రైతులు తిరిగి అలసిపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో రైతుబంధు పథకం తిరిగి అందుబాటులో వస్తుందని వడ్డీలేని రుణాలు అందుతాయని ఎంతో ధీమాగా ఉన్నారు.

● రైతులకు ఎంతో ఉపయోగం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో నిల్వ ఉంచిన పంటలకు రైతుబంధు పథకం (2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో) ద్వారా రుణాలు అందేవి. ఈ పథకం ప్రారంభంలో ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.50 వేల వరకు రుణాలు ఇచ్చేవారు. ఆ తరువాత దశలవారీగా రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు ఇచ్చేవారు. ఒకసారి రైతుబంధు పథకంలో చేరితే ఐదేళ్ల వరకు వినియోగించుకోవచ్చు. పథకం కింద రుణం తీసుకున్న 180 రోజుల వరకు ఎలాంటి వడ్డీ భారం రైతులపై పడదు. ఆ తరువాత అంటే 180 రోజుల నుంచి 270 రోజుల వరకు దాదాపు 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. అంతేగాక రైతులకు ఆరోగ్య భరోసా ఇస్తూ ఉచిత వైద్య శిబిరాలు కూడా నిర్వహించేవారు. రహదారుల అభివృద్ధి కూడా జరిగేవి. పశువులకు కూడా ముందస్తుగా వ్యాధినిరోధక టీకాలు వేయించడం, అనారోగ్యంతో బాధపడుతున్న పశువులకు వైద్యం అందిచేవారు. వీటికి బడ్జెట్ కేటాయింపులు కూడా ఉండేవి. చిన్న, సన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మంగళం పాడేసింది. కేవలం సెస్సు వసూళ్లకే ప్రాధాన్యమి చ్చింది. దీనిపై ఏఎంసీలు కూడా ప్రశ్నించలేదు. కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. జిల్లాలో మొత్తం 50 గోదాముల్లో 57,650 ఎంటీఎస్ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. అయితే 11 గోదాములు మరమ్మతుకు గురయ్యాయని అధికారులు చెబుతున్నారు.

● రుణాల కోసం ప్రదక్షిణలు

జిల్లాలోని 8 ఏఎంసీలకు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. 2019-20 నుంచి 2023-24 వరకు ఏఎంసీల ద్వారా వచ్చిన ఆదాయం దాదాపు రూ.126.27 కోట్లు. అయితే దీనివల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండడం లేదు. రుణాల కోసం ఏఎంసీల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుంచి అనుమతు లు రావాలని, ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ పని చేయడం లేదంటూ అధికారులు సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో గతంలోలా వడ్డీ లేని రుణాలు అందుతా యని ఆశగా ఎదురుచూస్తున్నారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాములు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గోదాముల వివరాలు

ప్రాంతం	సామర్థ్యం (మెట్రిక్ టన్నులు)	సంఖ్య
నెల్లూరు	3,000	5
కోవూరు	8,600	5
కావలి	22,900	17
రాపూరు	1,000	1
ఆత్మకూరు	3,200	4
ఉదయగిరి	5,700	6
సర్వేపల్లి	5,050	6
కందుకూరు	8,200	6

స్వర్ణాల చెరువు ఘాట్‌లో జరుగుతున్న పనులు





కంట్రోల్ రూమ్‌కి వేసిన షెడ్డు

రొట్టెల పండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు!

● యాత్రికుల కోసం సౌకర్యాలు ● సిమెంటు పనులు నాసిరకం

● శ్రద్ధ వహించకపోతే కొద్దిరోజులకే దెబ్బతినే అవకాశం



నాణ్యత లేకుండా జరుగుతున్న టైల్స్ అమరిక



స్నానాల షవర్ల వద్ద వేస్తున్న షెడ్డు

మతసామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండుగకు నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే నెల మూడో వారంలో ఈ రాష్ట్ర పండుగ జరగనుంది. దర్గా గంధమహోత్సవం, రొట్టెల పండుగకు ఏటా దేశవిదేశాల నుంచి లక్షలాది మంది యాత్రికులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం వసతుల కల్పనకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ యంత్రాంగం పనులు చేపట్టింది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి నెల్లూ రుకు చెందిన పొంగూరు నారాయణ మరోసారి మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో రొట్టెల పండుగను గతంలో మాదిరి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే పనులు ప్రారంభించారు. కంట్రోలు రూమ్, భక్తుల స్నానం చేసే షవర్స్ వద్ద షెల్టరు, మహిళలు దుస్తులు మార్చుకు నేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వర్ణాల చెరువు ఘాట్‌లో దెబ్బతిన్న టైల్స్ స్థానం లో కొత్తవి అమరుస్తున్నారు. అవసరమైన చోట సిమెంటు పనులు కూడా చేస్తున్నారు. అయితే ఈ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే ఆరోప ణలు వినిస్తున్నాయి. చెంతనే చెరువు ఉన్నప్పటికీ నీటితో సక్రమంగా క్యూరింగ్ చేయడం లేదనే విమర్శలు న్నాయి. నాణ్యత విషయంలో శ్రద్ధ వహించకపోతే లక్షలాది రూపాయల ప్రజాధనంతో చేసే పనులు కొద్ది రోజులకే మళ్లీ దెబ్బతినే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో ఇలాగే జరగడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఇక, ఘాట్ పక్కనే ఉన్న బోటింగ్ క్లబ్‌లోని పిల్లల పార్కు ఇంకా అధ్వానంగానే ఉంది. దానిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే, పండుగ నాటికి చెరువులో నీటి మట్టం పెంచాల్సిన ఆవశ్యకత కూడా ఉంది.

- నెల్లూరు (సాంస్కృతికం)

అనర్హులకు పింఛన్లపై ఫిర్యాదు

● అధికారుల విచారణ

● తొలగిస్తారేమోనని సచివాలయంలో రభస

మనుబోలు, జూన్ 25: తమ గ్రామంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చారని, ఈ విషయమై విచారణ చేపట్టాలని మండలంలోని అక్కంపేట గ్రామస్థులు డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆ గ్రామ సచివాలయానికి విచారణ నిమిత్తం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వెంకటయ్య, డీఎల్‌డీవో వసుమతి, నెల్లూరు ఏఎస్‌డబ్ల్యూవో తదితరులు వచ్చారు. దాదాపు 40మందికిపైగా పింఛన్‌దారుల వివరాలను డిజిటల్ అసిస్టెంట్ తిరుమలరావు నుంచి సేకరించారు. ఆయా పత్రాలను గ్రామస్థుల సమక్షంలో పరిశీలించారు. పింఛన్లపై విచారణకు సచివాలయానికి అధికారులు వచ్చారని తెలుసుకున్న కొంతమంది గ్రామస్థులు అక్కడికి చేరుకుని రభస చేశారు. తమ పింఛన్లు ఎలా తొలగిస్తారంటూ గొడవ చేశారు. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు అన్నీ సక్రమంగానే ఉన్నాయని తేల్చారు. ఎవరి పింఛన్లు తొలగించడం లేదని, కేవలం విచారణ మాత్రమే చేశామని చెప్పడంతో వారు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంకబాబు పాల్గొన్నారు.

30న స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జూన్ 25 : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 30వతేదీన జూనియర్, సబ్‌జూనియర్ బాల,బాలికల జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సుంకర మధు, కే సనత్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1లో పాల్గొనే వారు 15, 16, 17 సంవత్సరాల వయసు, గ్రూపు-2 వారు 12, 13, 14 సంవత్సరాలు, గ్రూపు-3లో వారు 10, 11 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు కర్నూలు జిల్లాలో జూలై 13, 14 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు స్విమ్మింగ్ కోచ్ డీ నాగరాజు 8801916198 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

28న గురుకులాల్లో రాత పరీక్ష

నెల్లూరు(హరనాథపురం), జూన్ 25 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 9 తరగతుల్లో మిగిలిన ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 28న రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ కోఆర్డినేటర్ హేమలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9030490584 నెంబరును సంప్రదించాలని కోరారు.

దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి

● జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో డీఆర్వో లవన్న



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

నెల్లూరు(హరనాథపురం), జూన్ 25 : జిల్లాలోని ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎన్ఎంఆర్, దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ లవన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో కనీస వేతనాల అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎన్ఎంఆర్, దినసరి వేతనాల ఉద్యోగులకు నైపుణ్యం లేని వారికి రూ.560గా, అర్ధ నైపుణ్యం కలిగిన వారికి రూ.665, నైపుణ్యం కలిగిన వారికి రూ.794, ఉన్నత స్థాయి నైపుణ్యం కలిగిన వారికి రూ.907 చొప్పున రోజువారీ వేతనాలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ వేతనాలు 2025 మార్చి నెలాఖరు వరకు అమలులో ఉంటాయన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అధికారులు ఈ వేతనాలు అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మికశాఖ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ జీఎం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), జూన్ 25 : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు చట్టా లను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. జిల్లా సలహా సంఘం సమావేశం మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కేంద్రాల నిర్వాహకులు ఫారం-ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏఆర్‌టీ క్లినిక్‌లు కూడా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. సరోగసి ద్వారా పిల్లలు కనేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు గీతాలక్ష్మి, కిరణ్, లక్ష్మి, శ్రీనివాసరావు, కనకరత్నం, వినోద్‌కుమార్, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

'సోమశిల'లో 10.080 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, జూన్ 25: సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి 393 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి 10.080 టీఎం సీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

ఇంట్లో జారిపడి అన్న మృతి

● ఆ బాధతో గుండెపోటుకు గురై తమ్ముడి మరణం

● ఇద్దరు సోదరులకు ఒకే రోజు అంత్యక్రియలు ● కావలిలో విషాదం



లేబాకుల సుధాకర్‌రెడ్డి (ఫైల్)



లేబాకుల వెంకటశేషారెడ్డి (ఫైల్)

కావలి, జూన్ 25: ఇంట్లో జారిపడి అన్న మృతి చెందగా ఆ బాధతో గుండెపోటుకు గురై తమ్ముడు మరణించాడు. 48 గంటల్లో మృతి చెందిన సోదరులు ఇద్దరికీ ఒకే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కావలిలో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాల మేరకు... కావలి పట్టణంలోని క్రిష్టియన్‌పేటలో నివాసం ఉంటున్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, బామా వ్యవస్థాపక కార్యదర్శి లేబాకుల సుధాకర్‌రెడ్డి(70) ఆదివారం తన ఇంట్లో జారిపడి ఆకస్మికంగా మృతి చెందాడు. అయితే న్యూజిలాండ్‌లో ఉన్న ఆయన సోదరుడి కుమారుడి రాక కోసం ఆయన అంతర్యక్రియలు మంగళవారం నిర్వహించతలపెట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగా ఆయనకు పిల్లలు లేకపోవడంతో ఆయన సోదరుడు లేబాకుల వెంకటశేషారెడ్డి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమయ్యాడు. రెండు రోజుల పాటు అన్న మృతదేహం వద్ద మనోవేదనకు గురైన ఆయన స్నానం చేసేందుకు ఇంట్లోకి వెళ్లి అక్కడే కుప్పకూలి పడి పోయాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు స్థానిక ఓ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఈ లోపు సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు ముగించేలోపే ఆయన సోదరుడు కూడా మార్గ మధ్యంలో మృతి చెందాడన్న వార్త అందింది. దీంతో ఆయనకు మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అన్నకు అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమైన తమ్ముడు గుండెపోటుతో మరణించడంతో కుటుంబంతో పాటు కావలిలో విషాదచాయలు అలుముకున్నాయి.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

● అదనపు డీఎంహెచ్‌వో ఖాజావలి

సంగం, జూన్ 25: డయేరియా, సీజనల్‌వ్యాధులపై వైద్య సిబ్బందితో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాజావలి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న బీసీజీ టీకా కార్యక్రమం గురించి ఆరా తీశారు. ఎవరికైనా డయేరియా లక్షణాలు కన్పిస్తే స్థానిక వైద్యశాలకు వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. వైద్య సేవలపై అలసత్వం ప్రదర్శించరాదని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సంగం: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాజావలి

ఉదయగిరి రూరల్: డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన సూచించారు. స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై తెలియజేయాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు నీటిపరీక్షలు నిర్వహించి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


అనంతసాగరం: మాట్లాడుతున్న ఎంపీడీవో తాజ్‌మస్రూర్


ఉదయగిరిలో మాట్లాడుతున్న వైద్యాధికారి శివకల్పన

అనంతసాగరం: మండల ప్రజలకు డయోరియా వ్యాధిపై అవగాహన కల్పించి, జాగ్రత్త చర్యలు సూచించాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, స్థానిక వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు, జూన్ 25: జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా గురుశిష్యుల సంబంధాలను తెలియజేస్తూ ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు మంగళవారం బి.చిరువెళ్ల, గొల్లపల్లి, నారంపేట గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధసేవా సమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు సరోజనమ్మ, పద్మమ్మ, శేషాద్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు మురగళ్ల సుధాకరాచారి పాల్గొన్నారు.

అప్రెంటీస్ లేని డీఎస్సీ ప్రకటించాలి

సీతారామపురం, జూన్ 25: నూతన ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అప్రెంటీస్ విధానం లేకుండా నోటిఫికేషన్ విడుదల చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు భోగ్యం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బసినేనిపల్లి ఉపాధ్యాయులతో ఆయన సంఘం సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, కొండయ్య, రంతుజాని, పేరాల శ్రీనివాసులు, అన్నంగి ప్రసాదు, ఆనందేశ్వరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సీతారామపురం, జూన్ 25: మారంరెడ్డిపల్లిలో అనారోగ్యంతో మరణించిన తెలుగుదేశం నాయకులు కలివెల దానమయ్య కుటుంబసభ్యులను మంగళవారం ఉదయగిరి మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా దానమయ్యతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి, జూన్ 25: పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు మండలంలోని గ్యాస్ వినియోగదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని నిర్వాహకులు పువ్వాలి వెంకటయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకం సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కనెక్షన్ కుటుంబంలో మగ, ఆడ ఎవరి పేరు మీద ఉన్నా సబ్సిడీ వర్తిస్తుందన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సంగం, జూన్ 25: అన్నారెడ్డిపాళెం గిరిజన కాలనీ పాఠశాల విద్యార్థులకు సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు మంగళవారం విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎస్.భాష పంపిణీకి సహకరించిన పఠాన్ బాషాసాహెబ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గజేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సుజలధార'కు మరమ్మతులు

అనంతసాగరం, జూన్ 25: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సుజలధార పథకానికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో పనులు పూర్తి చేసి నిర్దేశించిన గ్రామాలకు మినరల్ వాటర్ సరఫరా చేస్తామన్నారు. ఇటీవల ప్లాంట్‌లో మోటార్లు రిపేరు కావడంతో మూతపడిన సుజలధార ప్లాంట్ అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో ఆనం స్పందించారు. మంత్రి ఆదేశాలతో పనులు పూర్తిచేశామని మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ తెలిపారు. ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ప్లాంట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

రైల్వే అభివృద్ధికి శాంతియుత పోరాటం

బిట్రగుంట, జూన్ 25: స్థానిక రైల్వే అభివృద్ధికి శాంతియుత పోరాటం చేస్తున్నామని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్.నూరుద్దీన్ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట లోని ఆయన స్వగృహానికి రైల్వే స్పెషల్ బ్రాంచ్ అధికారి రమణయ్య, ఆర్పీఎఫ్ ఎస్సై కిరణ్‌కుమార్‌తో పాటు నెల్లూరు, బిట్రగుంట రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ సిబ్బంది మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఆస్తులు, అధికారుల విధులకు ఆటకం కలిగించేలా చర్యలు చేపట్ట కూడదని నిర్ణయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునుస్వామి, వేణుగోపాల్, రమేష్‌బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన గంగాభవాని ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, జూన్ 25: గంగిరెడ్డిపల్లి అనంతపూరి గంగాభవాని ఉత్సవాలు మంగళవారం బండ్లుపొంగళ్ల కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అమ్మవారికి కాయకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


అలఘునాథుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


గ్రామోత్సవంలో గంగాభవాని అమ్మవారు

ఎడ్లు బండలాగుడు పోటీలు: ఉత్సవాల సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య దర్శి మన్నేటి వెంకటరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు ఎద్దులు బండలాగుడు పోటీలు ప్రారంభించారు. పోటీలో మూడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో నంద్యాల జిల్లా కుమ్మరికొట్టాలు గ్రామానికి చెందిన వినుకొండ రఫీ ఎద్దులు ప్రథమస్థానం, వైఎస్ఆర్ కడప జిల్లా రాజువారిపేటకు చెందిన లింగారెడ్డి హిశ్వితి ఎద్దులు ద్వితీయస్థానం, అదే జిల్లా పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య ఎద్దులు తృతీయస్థానాల్లో నిలిచాయి. వారికి ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ.25, రూ.20, రూ.15 వేలతో పాటు బహుమతులు అందజేసి సన్మానించారు.

వరికుంటపాడు: కొండ్రాజుపల్లిలో మూడురోజులుగా జరుగుతున్న పోలేరమ్మతల్లి తిరునాళ్ల మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు మేళతాళాలతో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


గంగిరెడ్డిపల్లిలో బండలాగుతున్న ఎడ్లు

ఆత్మకూరు: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథుని కల్యాణాన్ని భక్తులు నిర్వహించారు. ప్రతి నెలా జరిగే శ్రవణనక్షత్ర కల్యాణాలను, పర్వదినాల్లో జరిగే సరుగు కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి కృపాక టాక్షాలను పొందాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. నిర్మాణంలో ఉన్న కల్యాణ మండప నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

'నేను బడికి పోతా'ను

విజయవంతం చేయండి

సంగం, జూన్ 25: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమగ్ర శిక్ష అభిమాన్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఉషారాణి కోరారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకం, ఎనిమిది రకాల సామగ్రితో స్టూడెంట్ కిట్ల పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై సలహాలు ఇచ్చారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో 6 ఏళ్లు పైబడి 14ఏళ్ల లోపు పిల్లలందరినీ బడిలో చేర్పాలన్నారు. ఆమె వెంట ఎంఈవో 1, 2 జానికీరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య పాల్గొన్నారు.


సంగం: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి

ఉదయగిరి: పట్టణంలో మంగళవారం నేను బడికిపోతా కార్యక్రమంపై అధికారులు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మాట్లాడారు. 6-14ఏళ్లలోపు బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలు, ఉత్తమ బోధనపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, అధికారులు సమష్టిగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఇటుకబట్టీలు, చేపల చెరువుల వద్ద ఉన్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు చదువు యొక్క విశిష్టతను వివరించి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాతబస్టాండ్ సెంటర్‌లో మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు పాల్గొన్నారు.

సీతారామపురం: పండ్రంగిలోని ఎస్టీ కాలనీలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని మండల విద్యాధికారి మస్తాన్‌వలి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల హెచ్ఎం బాలిరెడ్డి, సీఆర్పీ వేంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాన్ని సందర్శించి బడిబయట పిల్లల వివరాలను సేకరించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలకు పంపాలని కోరారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న 8మంది పిల్లలను గుర్తించి, అల్లూరురాజు అనే ఏడో తరగతి విద్యార్థిని సీతారామపురం హైస్కూల్‌లో చేర్పించారు. మిగిలిన వారు ప్రతిరోజూ బడికి వచ్చేలా హైస్కూల్ హెచ్ఎంకు బాధ్యతలు అప్పగించారు.


సీతారామపురం: అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఎంపీడీవోలు



ఉదయగిరిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

అలుగు కాదు.. మురుగు కాలువే..!

ఆత్మకూరు, జూన్ 25: ఈ ఫొటోలో ఉన్నది మున్సిపాలిటీలోని ఎల్‌ఆర్‌పల్లి శివారు ప్రాంతం మురుగు కాలువ. అదేంటి ఇది వాగు అలుగు ఉందని అనుకుంటున్నారా..? అధికారులు, పాలకులు మాత్రం వీటిని డ్రైనేజీలు అంటున్నారు. పట్టణంలోని చాలా కాలనీల్లో మురుగు కాలువలు ఇలానే ఉన్నాయి. కొన్నింటిలో డ్రైనేజీలు ఉన్నా శిథిలం అయ్యాయి. ఈ సమస్యతో మురుగునీరు ఎక్కడపడితే అక్కడ పేరుకపోతుంది. మరికొన్నిచోట్ల రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తుంది. ప్రజలు అస్తవ్యస్త డ్రైనేజీలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జెఆర్‌పేట, ముస్లిం వీధి, కందివీధి, వందూరుగుంట, జెండాదిబ్బ, ఉలవదిబ్బ ప్రాంతాల్లో మురుగు కాలువలు పరిస్థితి ఇలాగే ఉంది. దోమల బెడదతో రాత్రిళ్లు ప్రజలు జాగరణ కాయాల్సిన దుస్థితి నెలకొంది. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో కొన్ని ప్రాంతాల్లోని డ్రైనేజీలు పొంగి మురుగునీరు ఇళ్ల లోకి చేరుతుందని స్థానికులు వాపోతున్నారు. అధి కారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఎల్‌ఆర్‌పల్లి శివారు ప్రాంతంలోని మురుగు కాలువ

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రారంభానికి నోచని బాలికల వసతిగృహం

● ఏడాది క్రితమే పనుల పూర్తి ● సిబ్బందిని నియమించని అధికారులు ● విద్యార్థినుల ఇక్కట్లు


ప్రారంభానికి సిద్ధంగా బాలికల వసతి గృహం

లింగసముద్రం, జూన్ 25: మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోగల ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న బాలికల వసతిగృహం ప్రారంభానికి నోచుకోలేదు. ఏడాదిక్రితం భవన నిర్మాణం పూర్తి చేసినా అధికారులు, సిబ్బందిని నియమించలేదు. వసతిగృహంలో పని చేసేందుకు ఓ మ్యాట్రిన్, ముగ్గురు వంటవారు, వాచ్‌మన్ లను నియమించాలి. వంటకు అవసరమైన పాత్రలు కూడా సమకూర్చాలి.ఇది ప్రారంభం కాకపోవడంతో మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థినిలు 15 నుంచి 20 కి.మీ లోపు దూరం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి వరకు, సీనియర్ ఇంటర్ చదివే మొత్తం బాలికలు 190 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ చెప్పారు. వసతి గృహం ప్రారంభమైతే బాలికల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వసతి గృహాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినిల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధే నా అజెండా

● ప్రజల అభిమానం మరువలేనిది
● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూన్ 25: ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని, నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని ఎన్నటికీ మరువలేనని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకరం అనంతరం తొలిసారిగా మంగళవారం నియోజవర్గంలో అడుగుపెట్టిన ఆయన రాత్రి 8గంటలకు కలిగిరి మండలానికి చేరుకున్నారు. మండలంలోని 14వ మైలు వద్ద టీడీపీ శ్రేణులు ఆయన అపూర్వ స్వాగతం పలికారు. వందలాది బైకులతో ఆయన వెంట పయనించారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.



జలదంకి : అభిమానులతో ఎమ్మెల్యే సురేష్, కలిగిరి : కాకర్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న చిరంజీవిరెడ్డి

కాకర్లకు అడుగడుగునా జననీరాజనాలు

జలదంకి : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి నియోజకవర్గంలోకి రావడంతో మండలంలోని జమ్మలపాలెం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి పూలవర్షం కురిపించారు. భారీ కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. జమ్మలపాలెం మిక్సిడ్‌కాలనీ వద్ద మాజీ సర్పంచు నక్కా మాధవరావు గజమాలతో స్వాగతం పలికారు. కాకర్ల గుర్రంపై ఎక్కి స్వారీ చేస్తూ అభివాదం చేశారు. అక్కడి నుంచి భారీ వాహన శ్రేణితో జాతీయ రహదారిపై విజయోత్సవ ర్యాలీ ప్రారంభమైంది. మార్గమధ్యంలో ఎల్ఆర్ అగ్రహారం, గట్టుపల్లి క్రాస్‌రోడ్, జలదంకి బస్టాండు కూడలి, కమ్మపాలెం, నాగిరెడ్డిపాలెం క్రాస్‌రోడ్స్, తిమ్మిదోమైలు, హనుమకొండపాలెం క్రాస్‌రోడ్, చినక్రాక మీదుగా కలిగిరి మండలం 14వ మైలు వరకు విజయోత్సవ ర్యాలీ జరిగింది. నేతలు అడుగడుగున ఘనస్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పోలీస్‌హౌసింగ్‌బోర్డు మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పి.మధుమోహన్‌రెడ్డి, నియోజకవర్గం నాయకులు దామా మహేష్‌నాయుడు, చంద్ర మధుసూదనరావు, బొట్లగుంట హరిబాబు, వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, తల్లపనేని మధుసూదనరావు, మునగాల తిరుమలరెడ్డి, ఏగూరి రఘు, బీజేపీ, జనసేన నాయకులు కంచర్ల శరత్, తోట మురళీ, నిమ్మకాయల రామ్‌చైతన్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బిట్రగుంట, జూన్ 25: బోగోలు మండలం సీఆర్‌పాలెంకు చెందిన టీడీపీ జిల్లా రైతు కార్యదర్శి కోట వెంకారెడ్డి సోదరుడు బలరామిరెడ్డి (58) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం బలరామిరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు బడుగు వెంకయ్య, అన్నంగి ఆదిశేషయ్య, బోగిరి ప్రభాకర్ ఉన్నారు.


బలరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ఎమ్మెల్యేకి ధన్యవాదాలు

సాగునీటి కోసం రైతుల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి వ్యవసాయానికి ప్రతి రోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని చెప్పడంతో నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన జేపీగూడూరు, ఏటీకండ్రిక, బీజీవీ కండ్రిక, ఎస్‌జీవీ కండ్రిక రైతులతో కలసి ఎమ్మెల్యేని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నేత కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, కరిపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గునపాటి క్రిష్ణారెడ్డి, పావన రామవరెడ్డి, మస్తాన్‌రెడ్డి, బుర్రా వెంకారెడ్డి, బత్తుల బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి : ఎంఈవోలు

కావలిరూరల్, జూన్ 25: విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరవచ్చని ఎంఈవోలు బి.గోవిందయ్య, సీహెచ్ వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. కావలి మండలం సిరిపురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలంటూ విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న, ఉపాధ్యాయులు విద్యార్థులు

కలిగిరిలో విద్యార్థుల మానవహారం

కలిగిరి : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీహైస్కూల్ విద్యార్థులు పాఠశాల నుంచి కలిగిరమ్మ దేవాలయం కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు, ఎంఈవో జీ సురేష్, పంచాయతీ కార్యదర్శి చెంచుక్రిష్ణయ్య, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మానవహారం నిర్మిస్తున్న విద్యార్థులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి : జేఏసీ

కావలిటౌన్, జూన్ 25: విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్‌శాఖ డీఈ కేఎస్ బెనర్జీకి నోటీసు అందజేశారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక సార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇంజనీర్లకు సకాలంలో పదోన్నతులు లభిస్తున్నాయని, కార్మికుల విషయం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుందని వాపోయారు. వేధింపులు సైతం ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. పెండింగ్ టీఏ బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు 327 యూనియన్ కార్యదర్శి సందానిబాషా, అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, 1104 యూనియన్ నేతలు శ్రీనివాసులు, యు రవి, ఓసీ యూనియన్ నేతలు పెంచలనాయుడు, దేవీప్రసాద్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేతలు కమల్‌కుమార్, కృష్ణమోహన్, బీసీ యూనియన్ నేతలు సత్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ డీఈకి నోటీసు అందజేస్తున్న జేఏసీ నేతలు


దాడులు హేయం : మాజీ ఎమ్మెల్యే

కావలిటౌన్, జూన్ 25: వైసీపీ నేతలు కార్యకర్తలు, వారి ఆస్తులపై దాడులు చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దాడికి గురై తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికొచ్చిన మాజీ వలంటీర్ రాజీవ్‌కుమార్(నటరాజ్)ను మంగళవారం ఆయన పరామర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక విధ్వంసక పాలన ప్రారంభించారని, ఇది ఎమ్మెల్యేకి తగదన్నారు. అలాగే బామా వ్యవస్థాపక కార్యదర్శి లేబాకుల సుధాకర్‌రెడ్డి మృతి కళారంగానికి తీరని లోటని, ఆయన సోదరుడు లేబాకుల శేషారెడ్డి అన్న మృతి జీర్ణించుకోలేక గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన సతీమణి ఆదిలక్ష్మీతో కలిసి లేబాకుల సోదరుల పార్థివదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

ముగ్గురు డీలర్ల రాజీనామా

లింగసముద్రం, జూన్ 25 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మండలంలోని ముగ్గురు రేషన్‌షాపుల డీలర్లు రాజీనామాలు చేశారు. మండలంలోని గంగపాలెం గ్రామానికి చెందిన 3వ రేషన్‌షాపు డీలరు సీహెచ్ అనూష, వీఆర్ కోటలోని 12వ షాపు డీలరు వంకాయల పాటి శాంతి, మేదరమెట్లపాలెంలోని 24వ షాపు డీలరు కె మాలకొండయ్యలు తమ రాజీనామాలను తహసీల్దారు జి శ్రీచరణ్‌కు అందజేశారు. అయితే మండలంలోని మిగిలిన 24 రేషన్‌షాపుల డీలర్లు జూన్ నెల సరుకులను విక్రయించిన తరువాత రాజీనామా చేస్తారని అధికారులతో చెప్పినట్టు తెలిసింది.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



కొండాపురం, జూన్ 25: పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను సమగ్రంగా రికార్డులలో నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి కే.రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్మి పంచాయతీలోని కుంకువారిపాలెం, రామానుజపురం ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలు, రామానుజుపురం ప్రాథమికోన్నత పాఠశాల, కొమ్మి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

నేడు నర్రవాడకు టీడీపీ శ్రేణులు

లింగసముద్రం, జూన్ 25 : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపొందడంతో బుధవారం జిల్లాలోని నర్రవాడలో వెలసిన వెంగమాంబకు మొక్కులు తీర్చుకొనేందుకు 100 మందికి పైగా టీడీపీ శ్రేణులు వెళతున్నట్లు లింగసముద్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరంతా లింగసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన వారని తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

గుడ్లూరు, జూన్ 25 : మండలంలోని పాజర్లకు చెందిన రైతు కుందుర్తి ముసలయ్యకు సంబంధించిన వరిగడ్డివామి దగ్ధమైంది. దీంతో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల మేరకు.. సోమవారం రాత్రి ఎవరో గుర్తుతెలియని ఆకతాయిలు సిగిరెట్ కాల్చి పడవేయడంతో నిప్పంటుకుని అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కందుకూరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 25 : మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ ఏడీ కసుకుర్తి వీరబ్రహ్మయ్య తెలిపారు వలేటివారిపాలెం పశువైద్యశాలలో మంగళవారం మూగజీవాల సంరక్షణపై వెటర్నరీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషకులకు అందుబాటులో ఉండి మూగజీవాలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం పశు బీమా తదితర పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంచార పశువైద్యాధికారి కేశంరెడ్డి వాసంతి, సిబ్బంది కొండారెడ్డి, మౌనిక, మహిత, వాణి, సృజన, దినేష్, సవదయ్య, తదితరులు పాల్గొన్నారు.


వెటర్నరీ సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీ వీరబ్రహ్మయ్య

మరమ్మతుల పేరుతో నిధుల స్వాహా

- ఏడాదిలో మూడుసార్లు రిపేర్లు
- విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి..
- బుచ్చి ఎంపీడీవో కార్యాలయంలో ఇదీ పరిస్థితి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 25 : స్థానిక ఎంపీడీవో కార్యాలయం అధికారుల పాలిట కల్పతరువుగా మారింది. నిత్యం ఏదో ఒక మరమ్మతుల పేరుతో గోరంత పనికి కొండంత బిల్లులు చేసుకుని పబ్బం గడుపుకుంటున్నారు. గత ఏడాది కాలంలో ముగ్గురు ఎంపీడీవోలు సుమారు రూ.70లక్షల మేర నిధులను డ్రా చేసుకున్నారు. బోర్లు, రోడ్ల పేరుతో పాత పనులకే 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, మండల నిధులను దిగమింగారని ఆశాఖ సిబ్బందితోపాటు స్థానికులూ విమర్శలు గుప్పిస్తున్నారు. 2023, జూన్‌లో పదోన్నతిపై తిరుపతి జిల్లా బీవీ కండ్రికకు డీవీ నరసింహరావు బదిలీ అయ్యారు. నెల్లూరురూరల్ ఎంపీడీవో కార్యాలయం నుంచి ఈవోపీఆర్డీ పెంచలశ్యాంను బుచ్చికి ఎఫ్ఏసీ ఎంపీడీవోగా నియమించారు. అదే ఏడాది డిసెంబరులో ప్రత్యేక జీవోతో నరసింహరావు మళ్లీ బుచ్చికి బదిలీగా అయ్యారు. కాగా ఎన్నికల నేపథ్యంలో డీవీ నరసింహరావు అనంతపురం జిల్లా తాడిపర్తికి బదిలీకాగా, ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి వచ్చారు. గత ఏడాది కాలంలో ఎమ్పీడీవో కార్యాలయానికి మూడు సార్లు మరమ్మతులు చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఓ వైపు నగర పంచాయతీలో నిధులులేక పారిశుధ్యం, తాగునీటి సమస్యలతో ప్రజలు అలమటిస్తుంటే ఇలా ప్రజాధనం దుర్వినియోగం చేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిధులు దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూస్తాయి.

నిధుల డ్రా నిజమే..

గతంలో ఎంపీడీవోలుగా పనిచేసిన పెంచలశ్యాం, నరసింహరావుల హయాంలో మరమ్మతులు, పాత పనుల పేరుతో సుమారు రూ. 70లక్షలు నిధులు డ్రాచేసిన విషయం వాస్తవమే. ఇందుకు సంబంధించిన సమాచారం టైపిస్టు ఆనంద్, ఎంపీడీవోల వద్దే ఉంది. క్యాష్‌బుక్, రికార్డులు అడిగినా ఇవ్వలేదు. ఆ వివరాలు ఏవోకి, సీనియర్ అసిస్టెంట్‌కు కూడా తెలియకపోవడం విచారకరం. తాను మరమ్మతులకు వినియోగించిన నిధుల వివరాలను రికార్డుల్లో నమోదు చేశా.

- ఎంపీడీవో రాజ్యలక్ష్మి



బుచ్చి ఎంపీడీవో కార్యాలయంలో గత వారం చేపట్టిన మరమ్మతులు

సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు - భయాందోళనలో గ్రామీణులు

బుచ్చిరెడ్డిపాళెం,జూన్25: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులైన డయేరియా, జ్వరాల బారిన పడుతున్నారు. వారం రోజులుగా జొన్నవాడ, పెనుబల్లి, పంచేడు, ఇస్కపాళెం, గ్రామాల్లో పలువురు చిన్నారులు, వృద్ధులు వాంతులు, విరేచనాలకు గురికాగా, మరికొంతమంది జ్వరాల బారిన పడ్డారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి ఆదేశాలతో పంచాయతీ అధికారులు, సర్పంచులు, తాగునీటి పరీక్షలు నిర్వహించారు. పెనుబల్లిలో ఇన్‌ఫెక్షన్ కనిపించగా, మరోసారి తాగునీటి పరీక్షలు నిర్వహించగా మంచి ఫలితాలు వచ్చాయని వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు తెలిపారు. జొన్నవాడ, పెనుబల్లి గ్రామాలో వైద్యాధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధుల అదుపునకు చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ అహ్మద్‌బాబు తెలిపారు.



పంచేడులో వృద్ధురాలికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది



పొదలకూరు : మహమ్మదాపురం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

● మహమ్మదాపురం పీహెచ్‌సీ పరిశీలన

పొదలకూరు : మండలంలోని మహమ్మదాపురం పీహెచ్‌సీని జిల్లా టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మంగళవారం పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం బత్తులపల్లి, ప్రభగిరిపట్నం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను విజిట్ చేసి, బీసీజీ టీకా వేయించుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.శ్రీనివాసులు, ఎస్‌టీఎస్ శబరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి విజయంతో మొక్కు చెల్లింపు

వెంకటాచలం, జూన్ 25: సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం సాధించడంతో మంగళవారం టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ ఖాయ్యుమ్ ఖాన్ నాగూర్ మీరయ్యకు మొక్కు తీర్చుకున్నారు. తమిళనాడులోని నాగూర్‌నాగపట్టణానికి చేరుకుని మీరయ్యకు తలనీలాలు సమర్పించడంతోపాటు దర్గా వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి పేరిట ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆక్రమిత స్థలంలో బోర్డు ఏర్పాటు

పొదలకూరు, జూన్ 25 : పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లోని 286 అంకణాల పబ్లిక్ స్థలాన్ని కొందరు వైసీపీ నేతలు ఆక్రమించుకుని అమ్మకాలు చేయాలని చూశారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టీడీపీ నాయకులు అధికారుల సాయంతో ఆ స్థలంలో బోర్డు నాటారు.

117 జీవోను రద్దు చేయండి

వెంకటాచలం, జూన్ 25 : ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో నెంబరు 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చేవూరు సుబ్బారావు కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీధర్, నారాయణ, సురేష్, చంద్రశేఖర్, రవీంద్ర, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీపై అవగాహన

వెంకటాచలం : స్థానిక రావూస్ కళాశాలలో మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఎమర్జెన్సీపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా నాయకులు నరేష్, నవీన్, సురేష్, లోకేష్, శివ, పాల్గొన్నారు.

● గ్రామ సభ

తోటపల్లి గూడూరు : మండలంలోని వరిగొండలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర అభయాంజనేయ ఆలయంలో ఉత్సవాలు

పొదలకూరు, జూన్ 24: పట్టణంలోని వీర అభయాంజనేయ ఆలయంలో హనుమజ్జయంతి అనంతరం నాలుగో మంగళవారం రెడ్డి జన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజలు, తీర్థప్రసాదాల వినియోగం జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని ప్రభగిరిపట్నం శ్రీఆంజనేయస్వామి, శివాలయాల్లో కూడా ఆమె పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట టీడీపీ మహిళా నాయకులు ఆదాల సుగుణమ్మ, సాయిసుదీష, తలచీరు మస్తాన్‌బాబు, అంజి, తదితరులు ఉన్నారు.



ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకం చేస్తున్న సోమిరెడ్డి జ్యోతి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల చిత్రపటాలను బహూకరిస్తున్న టీడీపీ నాయకులు

కొడవలూరు జూన్ 25 : సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు ఏకోల్లు వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో యల్లాయపాళెం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి టీడీపీ నాయకులు గరికపాటి రాజేంద్రకుమార్, వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను మంగళవారం బహూకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అవినీతి రహిత కోవూరు నియోజకవర్గ స్థాపన ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమన్నారు. ఆమె ఎమ్మెల్యేగా రావడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు రియాజ్ బాషా , రాఘవేంద్ర, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

పొదలకూరు, జూన్ 25: జాతీయ ఉపకార వేతనానికి మండలంలోని అమ్మవారిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం. ఎం.విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఆర్‌వీ.చరిత్ జిల్లా స్థాయిలో 4 వర్యాంకు సాధించాడని తెలిపారు. మరో విద్యార్థి జి.నవదీప్ కూడా స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు.వీరికి ప్రతి ఏటా రూ.12వేలు చొప్పున నాలుగేళ్లపాటు కేంద్రం ఉపకారవేతనం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ జి.సురేంద్రకుమార్‌ను, విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



చరిత్ నవదీప్

రైతులకు పిల్లిపెసర విత్తనాల పంపిణీ

మనుబోలు, జూన్ 25: స్థానిక రైతులకు మంగళవారం ఆర్‌బీకేలో పిల్లిపెసర విత్తనాలను వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. మండలానికి 100కింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు వచ్చాయన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా, రైతుల నుంచి పాస్‌పుస్తకాల నకళ్లు తీసుకుని ఇస్తున్నట్లు ఏవో జహీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్ రెడ్డి, రావుల అంకయ్య గౌడ్, మారంరెడ్డి రమణారెడ్డి, రాజాగౌడ్, ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తన బస్తాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

స్టౌబీడీ కాలనీలో 'నేను బడికి పోతా' ర్యాలీ

కోవూరు, జూన్25: స్థానిక స్టౌబీడీ కాలనీలో విద్యాశాఖాధికారులు మంగళవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ ఎల్వీకే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లల్ని పాఠశాలల్లో చేర్పేందుకు అందరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు సుధీర్‌బాబు, ఖాజామొహిద్దీన్, ప్రసాద్, శాంతికుమారి, ఎంఈవో చెంచులక్ష్మమ్మ, హెచ్‌ఎంలు జావిద్, కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

1,139 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం

మనుబోలు, జూన్ 25: జూలై నెలాఖరుకల్లా మండల వ్యాప్తంగా 1,139 మట్టి నమూనాలు సేకరణ లక్ష్యంగా పెట్టు కున్నామని మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలన్నారు. పరీక్ష ఫలితాల కార్డు ఆధారంగా ఎరువులు, పోషకాలను ఎంతమేరకు వాడాలో అవగాహన కల్పిస్తామన్నారు.

రేబాలలో ఇరువర్గాల ఘర్షణ

బుచ్చిరెడ్డిపాళెం,జూన్25: మండలంలోని రేబాల పడమటి దళితవాడలో సోమవారం అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

రూ. 67.23 కోట్ల బిల్లులకు
లెక్కేది ఆదాలా...?

● టీడీపీ నాయకుడు నూకరాజు

నెల్లూరురూరల్, జూన్ 24 : ఏపీఆర్‌సీ ఎల్ అనే కంపెనీ పేరిట 2008-09లో పనులు చేసినట్టు చూపిన నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందుకు సంబంధించి 2024లో ప్యాకేజీ 1పీడీ - 2008-09 పేరిట ఏకంగా రూ.67.23 కోట్ల బిల్లులు చేయించుకున్నారని, వీటికి లెక్కలు ఎక్కడున్నాయని టీడీపీ నేత నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళ వారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదాల కంపెనీకి నిధులు సీఎఫ్‌ఎంఎస్ 2024-168100 నెంబరుతో జమయ్యాయని చెప్పారు. ఈ పనులు ఎక్కడ చేశారో ఆదాల చూపాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ నకిలీ బిల్లులంటూ ధ్వజమెత్తారు. ఇటీవలి ఎన్ని కల్లో నెల్లూరు రూరల్లో శ్రీధర్‌రెడ్డిపై పోటీకి ఎవరూ ముందుకు రాకపోతే ఆదాలను జగన్‌మోహన్ రెడ్డి పోటీకి నిలబెట్టారని చెప్పారు. అదే అలుసుగా తీసుకున్న ఆదాల, జగన్‌మోహన్ రెడ్డిని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి నిధులు పొందారని ఆరోపించారు. ఇందుకు తమ వద్ద స్పష్టమైన ఆదాలున్నాయని చెప్పారు.



మాట్లాడుతున్న టీడీపీ నేత మదన్‌కుమార్‌రెడ్డి

నాపై అక్రమ కేసులు బనాయించింది ఆదాలే... : సమీ

తన మీదు అక్రమంగా పీడీ, 307 వంటి బలమైన కేసులను ఆదాల ప్రభాకర్‌రెడ్డే పెట్టించారని మరో నాయకుడు సమీ ధ్వజమెత్తారు. మంగళ వారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తనపై అక్రమ కేసులు బనాయించింది ఆదాల కాదని ఆయన బిడ్డలపై ప్రమాణం చేసి చెప్తాడా...? అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తనను 15 రోజులు కడప జైల్లో పెట్టించి కుటుంబాన్ని ఆవేదనకు గురిచేశారన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వీఆర్సీలో ఎన్‌సీఈఆర్టీ పరిశీలన

నెల్లూరు (విద్య): నగరంలోని వీఆర్ కళాశాలను ఎన్‌సీఈఆర్టీ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ కళాశాలలో త్వరలో ఎన్‌సీఈఆర్టీ తాత్కాలిక ప్రాంతీయ కేంద్రం ప్రారంభంకానుండటంతో సంస్థ కార్యకలాపాలు, తరగతుల నిర్వహణకు సంబంధించి ఎన్‌సీఈఆర్టీ సభ్యులు, ప్రిన్సిపాల్, ఏవో పరిశీలన జరిపారు. పనులను వేగవంతం చేసి తరగతి గదులను సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జూలై 1వతేదీ నాటికి పూర్తిస్థాయిలో ఎన్‌సీఈఆర్టీ కార్యక్రమాలు వీఆర్సీలో ప్రారంభించనున్నామని హెచ్‌వోడీ రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో చలపతిరావు, సభ్యుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాసంప్రోక్షణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 25 : నగరం లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న గురువా యుర్ మహావిష్ణు ఆలయంలో జరుగు తున్న పుష్కర మహాసం ప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవం మంగళవారం మూడోరోజు కొనసాగింది. ఉదయం మహాలక్ష్మీ అమ్మవా రికి నవ కలిశ స్నపన తిరుమంజ నం, ద్వారతోరణం, ద్వార చక్రాబ్ది మహాకుంభారాధన, చతుష్కుండ హోమాలు, శాత్తుమురై, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం ద్వారతోరణం, మహా కుంభ, చక్రాబ్ది మండల ఆరాధన, చతుష్కుండ హోమాలు, పూర్ణాహుతి జరిగాయి.

మంత్రి రామనారాయణకు శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 25 : రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం నగరంలోని సంతపేట లో ఉన్న క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీఎస్‌యూ కోర్సుల వివరాలు, వర్సిటీ ప్రగతి, తదితరాలను మంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయని రామనారాయణ హామీ ఇచ్చారు. కాగా, మంత్రిని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్.కాలేషా కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ సలీం పాల్గొన్నారు.



మంత్రి రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నూర్‌బాషా సంఘం నాయకులు

అధికారులపై చర్యలు తీసుకోవాలి

● డయేరియా బాధితులను పరామర్శించిన యానాదుల సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 25 : గూడూరు పరిధిలోని చెన్నూరు ఎస్టీ వసతి గృహంలో 21 మంది విద్యార్థులు డయేరియాకు గురికావడంతో ఆ హాస్టల్ వార్డన్‌తోపాటు ఐటీడీఏ అధికారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ పిల్లలు డయేరియాకు గురికావటానికి బూజు పట్టిన కందిపప్పు, ఆహార సామగ్రే కారణమని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలపల చంద్రమౌళి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.



బాధిత చిన్నారులతో మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

● ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల

నెల్లూరు (వైద్యం), జూన్ 25 : జిల్లాలో వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ఉద్యోగో న్నతి కల్పించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతల తోపాటు పిల్లలకు ఏఎన్‌ఎంలు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు, వ్యాధి నిరోధక టీకాల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దాదాపు 30 ఏళ్లుగా సేవలందిస్తున్న ఏఎన్‌ఎంలకు ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా కోశాధికారి మజరుల్లా, జిల్లా నేతలు జ్యోతి, వసంత, సోమేశ్వరరావు, చెంచురామయ్య, వరలక్ష్మి, గౌస్‌బాషా, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

చదువుకుంటేనే భవిష్యత్తు : రూరల్ సీఐ

నెల్లూరురూరల్, జూన్ 25 : జీవితాన్ని అనుకున్న విధంగా తీర్చిదిద్దుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమని నెల్లూరు రూరల్ సీఐ మారుతీకృష్ణ అన్నారు. మంగళ వారం మండలంలోని సౌత్‌మోపూరులో వాణిశ్రీ జడ్పీ హైస్కూల్లో పదో తరగతికి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 500కు పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్ చైర్మన్ మస్తానయ్య విజేతలకు ఏటా నగదు బహుమతి ఇచ్చేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, కాకుపల్లి మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్య, బీరం పవన్‌కుమార్‌రెడ్డి, అన్నం విజయసారథి పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు బహుమతి అందచేస్తున్న సీఐ మారుతీకృష్ణ

ఫోర్జరీ నిందితులపై చర్యలు లేవి?: రాష్ట్ర స్టూడెంట్ జేఏసీ


నెల్లూరు (సాంస్కృతికం): నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ సంతకాలు ఫోర్జరీ చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని రాష్ట్ర స్టూడెంట్ జేఏసీ చైర్మన్ జీవీ ప్రసాద్ ప్రశ్నించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడా రు. ఫోర్జరీ కేసులో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నగర మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్‌పై కలెక్టర్, కమిషనర్ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వారిద్దరిని తక్షణం బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేద్దాం

నెల్లూరు రూరల్, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తున్న నేను బడికిపోతా కార్యక్రమా న్ని అందరూ కలిసి విజయ వంతం చేయాలని ఎంఈ వోలు బిక్షాలు, మురళీ ధర్ కోరారు. నెల్లూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ కచ్చితంగా బడిలో ఉండాలన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో శైలేంద్రకుమార్ పాల్గొన్నారు.

సీఏఎం పాఠశాలలో గస్తీ ఏర్పాటు : సీఐ

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 25 : నగరంలోని సీఏఎం పాఠశాల్లో పగలు, రాత్రి గస్తీ ఏర్పాటు చేసినట్లు చిన్నబజా రు సీఐ అశోక్‌బాబు తెలిపారు. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించిన సీఏ ఎం పాఠశాల ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించడంతో చిన్నబజారు సీఐ అశోక్ మంగళవారం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. ఆ పాఠశాలతోపాటు చుట్టుపక్కల పోలీసు గస్తీ ముమ్మరం చేశామని, ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అను మానితులు కనిపిస్తే టోల్ ఫ్రీ నెంబరు 112కి సమాచారం అందించాలని స్థానికులను కోరారు.



సీఏఎం పాఠశాల గదిలో చిన్నబజారు సీఐ, ఎస్సై, సిబ్బంది

సమస్యలు పరిష్కరించండి

● కమిషనర్‌కు మాజీ మేయర్ భానుశ్రీ విజ్ఞప్తి


నెల్లూరు రూరల్, జూన్ 25 : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్‌తో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. టీడీపీ తరఫున నగరంలోని కొన్ని మున్సిపల్ డివిజన్లకు ఆమె ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సదరు డివిజన్లలో సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. కాగా, కాలువల్లో పూడికతీతపై టీడీపీ నాయకుడు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ 41వ డివిజన్‌లో పర్యటించారు. బాలాజీనగర్ వద్ద మురుగు కాలువను పరిశీలించారు. తక్షణ చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు (విద్య), జూన్ 25 : విజయవాడలోని శాతవాహన కళాశాలలో ఈనెల 22 నుంచి 24వతేదీ వరకు జరిగిన అండర్-10, 13, 15 ఓపెన్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. అండర్-15 రికర్వ్ రౌండ్‌లో చాట్ల అక్షయ్ మహదేవ్ బంగారు పతకం, ఇండియన్ రౌండ్‌లో ఏ లాస్య కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. అండర్-13 ఇండియన్ విభాగంలో వై దీత్యాచండిక, కే మధుసూదన్ నాల్గో స్థానం, రికర్వ్‌రౌండ్‌లో అక్షయ్ మహదేవ్ బంగారు, బీ అక్షయ రమణ నాల్గో స్థానం సాధించారు. అండర్-10 కాంపౌండ్ రౌండ్‌లో టీపీ గీర్వాణ్ రజతం, కే లలిత్ కాంస్యం, పీ మేధాసింగ్ కాంస్య పతకం, కే తన్విక్‌రావత్, పీ అహనాశ్రీ నాల్గోస్థానం దక్కించుకున్నారు. జాతీయ పోటీలకు స్టాండ్ బైగా చాట్ల అశ్విన్‌కుమార్, టీ విశ్వితారెడ్డి, కే లోహిత్‌కుమార్ యాదవ్, బీ నూతన్, జీ చైతన్య, డీ నిష్చితలు ఎంపికయ్యారని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.

స్కేటింగ్‌లో 'రత్నం'కు పతకాలు

నెల్లూరు (విద్య) : తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఐదో తరగతి విద్యార్థి ఎన్ సాయిమన్విత్ రింక్-1లో కాం స్యం, రింక్-2లో బంగారు, రింక్-3లో రజత పతకాలు సాధించిన ట్లు ఆ విద్యా సంస్థల జీఎం రామ్మూర్తి నాయుడు తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి జాతీయ పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాల డైరెక్టర్లుకృష్ణకిషోర్, వాసంతి కిషోర్ కూడా విద్యార్థికి అభినందనలు తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు

కనుల పండువగా పవళింపు సేవ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 25 : నగరంలోని మాగుంట లే అవుట్‌లో గల ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి పవళింపు సేవ నేత్రపర్వంగా జరిగింది. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మూలవరులకు పంచకలిశ స్నపన తిరుమజనం జరిగాయి. సాయంత్రం శ్రీవారికి ద్వాదశ ప్రదక్షిణలతో పల్లకీసేవ, ద్వాదశ ఆరాధనలు జరిగాయి. పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

రేపు తన్నీరు కోటయ్య సంతాపసభ

నెల్లూరు (సాంస్కృతికం) : సీనియర్ న్యాయవాది, వడ్డెర సంక్షేమ సంఘం నాయకుడు తన్నీరు కోటయ్య సంతాప సభ గురువారం సాయంత్రం 5గంటలకు నెల్లూరు టౌనుహాలులో జరుగుతుందని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ యాదవ్, జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ఉప్పు భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోటయ్య అభిమానులు, వడ్డెర, బీసీ సంఘ ఐక్యవేదిక నాయకులు తరలిరావాలని కోరారు.



రాబిన్‌హుడ్‌లో నటిస్తున్నా

శ్రీవారి సేవలో శ్రీలీల

హీరో నితిన్‌తో కలిసి 'రాబిన్‌హుడ్' అనే చిత్రంలో నటిస్తున్నట్టు హీరోయిన్ శ్రీలీల తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చాక మీడియాతో మాట్లాడారు. తన అమ్మమ్మ పుట్టినరోజు సందర్భంగా స్వామిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నామన్నారు. తాను పని మొదలుపెట్టే ముందు, పూర్తయ్యాక తిరుమలేశుడిని దర్శించుకోవడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. రాబిన్‌హుడ్‌తోపాటు మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా చేస్తున్నానన్నారు. ఆలయం ముందు శ్రీలీలను చూడటానికి.. సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

8న సీట్ అలాట్‌మెంట్

తిరుపతి(విద్య), జూన్ 25: ఏపీ ఈసెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం నుంచి ప్రారంభమౌతుందని కో-ఆర్డినేటర్ డాక్టర్ వై ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. డిప్లొమా ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన విద్యార్థులు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి.. రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేశాక కళాశాలలోని హెల్ప్‌సెంటర్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు.జూలై 1నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు, 5న మార్పు, చేర్పులు చేసుకోవచ్చని వివరించారు. జూలై 8న సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని తెలిపారు. స్పెషల్ కేటగిరీకి చెందిన పీహెచ్, ఎన్‌సీసీ, సీఏపీ, స్పోర్ట్స్ గేమ్స్, ఆంగ్లో ఇండియన్స్, స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని కౌన్సెలింగ్ కేంద్రంలో జూలై 2, 3 తేదీల్లో హాజరుకావాలని సూచించారు.



బహిరంగ సభకు పోటెత్తిన జనం

ఉద్వేగ స్వరం.. అభివృద్ధి పథం!

- కుప్పం అభివృద్ధిపైనే ప్రధాన ప్రసంగం
- మెజారిటీ తగ్గడంపై ఆవేదన
- మీ భవిష్యత్తుకోసం ఎంత కష్టమైనా పడతానని హామీ
- కుప్పంలో చంద్రబాబు అంతరంగం ఆవిష్కరణ
- ఆద్యంతం ఆకట్టుకున్న వినూత్న వ్యవహార శైలి

'నాకు వచ్చింది అధికారం కాదు, బాధ్యత. దీన్ని కుప్పంలో నిరూపిస్తా. నేను చెప్పేది చేస్తా. మీ జీవితాలు బాగు పడుతాయి.'

'నేను ప్రజలకోసమే సంపాదిస్తా. ప్రజలకోసమే కష్టపడుతా. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలి.'

'రాష్ట్రమంతా ఒక ఊపు ఊపిన మెజారిటీలు వచ్చాయి. కుప్పంలో 48 వేలేనా? ఎన్నడూ బయటకు రాని మా ఇంటి ఆడవాళ్లు వచ్చారు. భువనేశ్వరి స్వయంగా క్యాంపైన్ చేసే పరిస్థితి వచ్చింది.'

'సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉంది. అందుకు నిదర్శనం ఒక ఆడబిడ్డ తనకున్న మూడు ఎకరాల్లో ఒక ఎకరా అమ్మి మరీ రూ.25 లక్షలు అమరావతి నిర్మాణానికి విరాళమిచ్చింది.'

కుప్పంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగంలోని ఉద్వేగ సందర్భాలు ఇవి. భావోద్వేగ పూరితంగా ప్రసంగించిన ఆయన కుప్పం అభివృద్ధి గురించి ఏమాత్రం మరచిపోలేదు. సొంత నియోజకవర్గానికి ఏం చేయబోతున్నారో చెబుతూనే, ఇక్కడ తనకు వచ్చిన మెజారిటీ పట్ల తీవ్ర అసంతృప్తి, మనస్తాపం వ్యక్తం చేశారు. ఎక్కడా ఎటువంటి భేషజాలు, అధికార దర్పాలు ప్రదర్శించకుండా సరికొత్తగా తనను తాను ఆవిష్కరించుకున్న తీరు, ప్రసంగ శైలి ఆద్యంతం ఆకట్టుకుంది.

చంద్రబాబు కుప్పం పర్యటన తొలిరోజైన మంగళవారంనాడు 30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. హెలికాప్టరులో మధ్యాహ్నం ఒంటి గంటకు పీఈఎస్‌లోని హెలిప్యాడ్‌లో దిగిన సీఎం అధికారులు, పార్టీ నాయకుల నుంచి స్వాగత సత్కారాలు అందుకున్నారు. తర్వాత నేరుగా హంద్రీనీవా కాలువ సందర్శనకు బయలుదేరారు. జల్లిగానిపల్లె వద్ద మధ్యాహ్నం 2 గంటలకు, చిన్నారిదొడ్డి వద్ద 2.40 గంటలకు కాలువను సందర్శించి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు కూడలిలో బహిరంగ సభలో సాయంత్రం 4.35 గంటల నుంచి 5.55 గంటలదాకా ఏకధాటిగా ప్రసంగించారు.



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

● కుప్పం అభివృద్ధిపైనే దృష్టి

సాధారణ వ్యవహారశైలికి భిన్నంగా ఈసారి చంద్రబాబు ప్రధానంగా కుప్పం అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. అప్పుడప్పుడూ రాష్ట్రాభివృద్ధి, రాజధాని అమరావతి వంటి అంశాలను ప్రస్తావించినా అంతలోనే కుప్పం నియోజకవర్గానికి ఏం చేయబోతున్నారో చెప్పారు. గత వైసీపీ పాలనలో కుప్పంలో చెలరేగిన రౌడీమూకలను హెచ్చరిస్తూనే, రాబోయే అయిదేళ్లలో ఏయే అంశాలలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పెట్టాలనుకున్నారో ఏకరువు పెట్టారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'మళ్లీ సీఎంగా..' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తాకథనంలో ప్రస్తావించిన వివిధ ఆగిన అభివృద్ధి పనులను గురించి పేర్కొంటూ అన్నింటినీ సాధ్యమైనంత త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

అమరావతి, మెజారిటీపై భావోద్వేగం: చంద్రబాబు తన మెజారిటీ కేవలం 48 వేలకు పరిమితం కావడాన్ని భావోద్వేగంతో ప్రస్తావించారు. 'ఒకప్పుడు కుప్పంలో అందరూ మంచివాళ్లే ఉండేవారని, ఇప్పుడు కొంతమంది మారిపోయారు. మీరు బాగుపడితే చూడాలని నా కోరిక. ఇక్కడ ఇప్పుడు పుల్లలు పెట్టేవాళ్లు తయారయ్యారు. అయినా బాధలేదు. వచ్చే అయిదేళ్లలో వారిని మారుస్తా. ప్రతి కుటుంబానికి మంచి జరిగేలా చూస్తా.' అన్నారు. అమరావతిని తలచుకుని భావోద్వేగంతో కదిలిపోయారు. అమరావతికి యువతి ఒకరు ఎకరా అమ్మి ఇచ్చిన విరాళం గురించి ప్రస్తావించారు. డ్వాక్రా, మెప్మా సంఘాలతోపాటు టీడీపీ కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన రూ. లక్ష విరాళాలను స్వీకరిస్తూ, ఆయా సందర్భాల్లో అమరావతికోసం తాను ఎంత చేసింది గుర్తు చేసుకున్నారు.

- కుప్పం

తోతాపురి టన్ను రూ.30వేలకే కొనుగోలు చేయాలి

● కలెక్టర్ ఆదేశాలను పాటించండి: హెచ్‌వో



మండీలో మామిడి కాయల ధరలను ఆరా తీస్తున్న సౌజన్య

పుత్తూరు అర్బన్, జూన్ 25: కలెక్టర్ ఆదేశాల ప్రకారం తోతాపురి మామిడిని టన్ను రూ.30వేలు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని హార్టికల్చర్ అధికారి (హెచ్‌వో) సౌజన్య స్పష్టం చేశారు. 'సీజన్ ముగిసేటప్పుడూ ధరాఘాతమే' అనే శీర్షికన కథనం మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హెచ్‌వో.. పుత్తూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న మామిడి కాయల మండీలను పరిశీలించారు. కలెక్టర్ పదిరోజుల క్రితం ఇచ్చిన ఆదేశాల ప్రకారం తోతాపురి కాయలను టన్నుకు రూ.30వేలకు కొనుగోలు చేయాలని చెప్పారు. అయితే మంగళవారం కూడా తోతాపురి ధర అంతంత మాత్రంగానే పలికింది. మండీల్లో టన్ను రూ.23వేలకు కొనుగోలు చేశారు. పల్ప్ ఫ్యాక్టరీలు ధర పెంచితే తాము కూడా ఆ మేరకే కొనుగోలు చేస్తామని మండీల యజమానులు పేర్కొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నేడు డయేరియా నిర్మూలన కార్యక్రమం

తిరుపతి(వైద్యం), జూన్ 25: జిల్లావ్యాప్తంగా బుధవారం డయేరియా నిర్మూలనకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల విజృంభిస్తున్న డయేరియా కేసులను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖతోపాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మున్సిపాలిటీ శాఖల అధికారులూ పాల్గొంటారన్నారు.

వీఆర్ఎస్ తీసుకున్న శ్రీనివాసరాజు

● టీటీడీ జేఈవోగా సుదీర్ఘకాలం పనిచేసి.. తనదైన ముద్రవేశారు

తిరుమల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) జేఈవోగా సుదీర్ఘకాలంగా పనిచేసిన కేఎస్ శ్రీనివాసరాజు వీఆర్ఎస్ తీసుకున్నారు. ఏపీ ఐఏఎస్ క్యాడర్‌లో 2001 బ్యాచ్‌కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో టీటీడీ జేఈవోగా నియమితులయ్యారు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవోగా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేళ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఆయన ఇంటర్ కేడర్‌పై తెలంగాణ రాష్ట్రానికి వెళ్లారు. మార్చి నెలతో డిప్యుటేషన్ గడువు ముగియడంతో పొడిగింపునకు క్యాట్‌ను ఆశ్రయించారు. అనుమతి రాకపోవడంతో ఏపీకి రాక తప్పలేదు. గత మే నెలలో ఏపీ సీఎస్‌కు రిపోర్టు చేశారు. టీటీడీ ఈవోగా వచ్చేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినా కూటమి ప్రభుత్వం శ్యామలరావును ఈవోగా నియమించింది. దీంతో ఈనెల 19వ తేదీన శ్రీనివాసరాజు వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

జేఈవోగా చేసిన పనులివే..

శ్రీవారి భక్తుల క్యూలైన్ల నిర్వహణ, రద్దీ క్రమబద్ధీకరణలో పనితనం చూపారు. ఆలయంలో మూడు క్యూలైన్ల ఏర్పాటు కూడా శ్రీనివాసరాజు ఆలోచనే. ఐఐటీ ఎంటెక్ చదువుకున్న నేపథ్యంలో టీటీడీలో ఐటీ వినియోగాన్ని విస్తృతం చేశారు. క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో ఉండే భక్తులకు నిరంతరం అన్నప్రసాదాలు అందజేసేలా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. వీవీఐపీలకు, సామాన్యులకు సంతృప్తికరంగా దర్శనం చేయించడంలోనూ చురుగ్గా పనిచేశారు. రద్దీ సమయాల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేయడం అనే పద్ధతిని తీసుకురావడంతోపాటు సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు సాయంత్రం వీఐపీ బ్రేక్‌ను శాశ్వతంగా రద్దు చేశారు. గదుల కోసం భక్తులు గంటలు తరబడి క్యూలైన్‌లో నిలబడే అవసరం లేకుండా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సెల్‌కు మెసేజ్ అందాక వచ్చి గదిని నేరుగా తీసుకునే వెసులుబాటు కల్పించారు. అధిక లడ్డూలు తయారు చేసేందుకు సిబ్బంది సంఖ్యను పెంచడం, ఆర్జిత సేవా టికెట్లకు లక్కీ డిప్, వాహనాల పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి, సహస్రదీపాలంకార మండపం మార్పిడి, మాడవీధుల విస్తరణ, నూతన స్వర్ణరథం తయారీ, పార్కుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.



కుటుంబ సభ్యులతో శ్రీవారి ఆలయం ముందు కేఎస్ శ్రీనివాసరాజు (ఫైల్ ఫొటో)

'టెట్' ఫలితాల విడుదల

చిత్తూరు (సెంట్రల్), జూన్ 25: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలను మంగళవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఎన్నికల ముందు జగన్ ప్రభుత్వం బీఈడీ, డీఎడ్ అభ్యర్థుల కంటి తుడుపు చర్యగా కేవలం 6100 ఖాళీలు మాత్రమే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హడావుడిన చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ నిర్వహించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఫలితాల విడుదలకు బ్రేక్ పడింది. ఈ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 31,037 మంది బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు పరీక్షలు రాశారు. తిరుపతి జిల్లాలో 19,859 మంది కాగా, చిత్తూరు జిల్లాలో 7,173 మంది, అన్నమయ్య జిల్లాలో 4005 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. వీరిలో 18 వేల మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో టెట్ రాయడంలో అవకాశం కోల్పోయిన బీఈడీ, డీఎడ్ అభ్యర్థులతో పాటు ఇటీవల నిర్వహించిన టెట్‌లో ఫెయిలైన వాళ్లకూ రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జూలై ఒకటి నుంచి టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో విద్యాశాఖ అందుకు తగిన విధంగా సన్నాహాలు చేస్తోంది. కాగా, జూలై ఒకటో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుండటంతో వీరిలో ఆశలు చిగురించాయి.

ఎట్టకేలకు కోర్టు ఆదేశాలు అమలు

గత ప్రభుత్వ హయాంలో తొలగించిన 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లు మళ్లీ విధుల్లోకి..

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్వీయూ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 25: గత ప్రభుత్వ హయాంలో ఎస్వీ యూనివర్సిటీలో తొలగించిన 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లు మళ్లీ విధుల్లోకి చేరారు. ఉద్యోగాల నుంచి తొలగించాక వీరంతా న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. విచారించాక వీరిని విధుల్లోకి తీసుకోవాలని రెండేళ్ల క్రితమే వర్సిటీ అధికారులను కోర్టు ఆదేశించింది. అయినా వీరిని విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇపుడు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో తొలగించిన ఈ 23 మంది అకడమిక్ కన్సల్టెంట్లను విధుల్లోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కూడా వర్సిటీ అధికారులు జారీ చేశారు. దీనిపై విధుల్లోకి చేరిన అకడమిక్ కన్సల్టెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులిచ్చిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

బీసీ బాలికలకు 'జూనియర్ గురుకులం' అందని ద్రాక్షే!

అవస్థలు పడుతున్న విద్యార్థినులు ● ఆవేదనలో తల్లిదండ్రులు

కోట, జూన్ 25 : రెండు దశాబ్దాలుగా బీసీ బాలికలకు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల జూనియర్ కళాశాల ఎండమావిగా మిగిలింది. ఆయా బీసీ బాలికల గురుకులాల్లో 10వ తరగతి వరకు చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఇంటర్ చదువుకునేందుకు గురుకుల జూనియర్ కళాశాలలు లేక ఉన్నత చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజా ప్రతినిధులు మారుతున్నా బీసీ బాలికల జూనియర్ కళాశాల అందని ద్రాక్షలా మారింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కోటలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర జూనియర్ కళాశాల ఉంది. ఈ జూనియర్ కళాశాల, పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా తిరుపతి జిల్లా బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తుంటారు. అయితే బీసీ గురుకులాల్లో 10వ తరగతికి మాత్రమే గురుకుల పాఠశాలలు ఉండటం, ఆపై బాలికలకు జూనియర్ కళాశాలలు లేవు. జోన్ 1 పరిధిలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల, విశాఖ జిల్లా తానాంలలో బాలికలకు గురుకుల కళాశాలలున్నాయి. జోన్ 3 పరిధిలో కృష్ణా, గుంటూరు, ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలు ఎక్కడా లేవు. అదే విధంగా ఆ గురుకుల కళాశాలల పరిధిలో నిజాంపట్నం, దొరవారిసత్రం, కోటలలో మాత్రమే బాలురలకు ప్రత్యేకంగా జూనియర్ కళాశాలలున్నాయి. మిగతా ఎక్కడ బీసీ బాలికలకు జూనియర్ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక స్తోమతలేని బలహీన వర్గాల పిల్లలు టెన్త్‌లో మంచి మార్కులు సాధించినప్పటికీ ఇంటర్... ఆపై చదువులు చదివేందుకు బీసీ గురుకులాలు లేకపోవడంతో బాలికల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రతిభా పాటవాలు కలిగీ మంచి చదువులు చదువుకోవాలన్న తపన ఉన్నప్పటికీ ఆ విద్యార్థినుల ఆశలు ఎండమావిగానే మారిపోతున్నాయి. ప్రతి విద్యాసంవత్సరంలోనూ వందలాది మంది బీసీ బాలికలు 10వ తరగతిలో 500 మార్కులకుపైగా సాధించి ఇంటర్ చదివేందుకు బీసీ బాలికల జూనియర్ కళాశాల లేకపోవడంతో వారు అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులకు శాపనార్థాలు పెడుతున్నారు.

అరగంటకో బస్సు నడపండి

● ప్రజా రవాణా అధికారితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే రామకృష్ణ
● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

వెంకటగిరి, జూన్ 25: వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, నెల్లూరు మార్గాల్లో ప్రతి 30 నిమిషాలకో బస్సు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజా రవాణా అధికారిని కోరారు. 'రద్దైన ఆర్టీసీ సర్వీసులు... ఇబ్బందుల్లో ప్రయాణికులు' పేరిట ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. వెంకటగిరి డిపో మేనేజరు రామకృష్ణను పిలిపించి ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అనంతరం తిరుపతి ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో బెంగళూరు, చెన్నై, కీల్పాక్కంలకు వెంకటగిరి డిపోనుంచి బస్సు సరీసులు నడిచేవని వాటిని రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు.

చెస్ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ



వెంకటగిరి, జూన్ 25: అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 21న పట్టణంలోని మదర్ అకాడమీలో జరగనున్న ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీ పోస్టర్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు, జిల్లా అసోసియేషన్ కోఆర్డినేటర్ నర్రా విజయ్, టీడీపీ నాయకులు బి.రాజేశ్వరరావు, ఆర్‌రాజా తదితరులు పాల్గొన్నారు

టీడీపీ సీనియర్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ


రమణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

డక్కిలి, జూన్ 25 అనారోగ్యంతో బాధపడుతున్న డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన జిల్లా సెంట్రల్‌బ్యాంక్ మాజీ డైరెక్టరు వెలికంటి రమణారెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పి.రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.రాజేశ్వరావు, జి.వెంకటముని, పి.కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా విద్యాభ్యాసం

డక్కిలి, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాభ్యాసం ఉండాలని ఎంఈవో పి.జగదీష్ బాబు ఆదేశించారు. మంగళవారం వీకేపై సముద్రం ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఆయన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు.

పాలకొండ సత్రంలో పిచ్చికుక్క స్వైరవిహారం

14 మందికి గాయాలు


చికిత్స పొందుతున్న బాధితురాలు

వెంకటగిరి, జూన్ 25: మండలంలోని పాలకొండ సత్రంలో సోమవారం అర్థరాత్రి గ్రామస్తులపై పిచ్చికుక్క దాడిచేసింది. ఈ ఘటనలో పలువురు ఆస్పత్రిపాలయ్యారు. ఉక్కపోత భరించలేక గ్రామంలో ఆరుబయట నిద్రిస్తున్న 14 మందిపై పిచ్చికుక్క దాడి చేసింది. వారంతా వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం పిచ్చికుక్కను గ్రామస్తులు కొట్టి చంపేశారు.

రెండు బైకుల ఢీ

ఒకరి మృతి ● ఇద్దరికి తీవ్ర గాయాలు


మధు మృతదేహం

వెంకటగిరిటౌన్, జూన్ 25: మండల పరిధిలోని మొగళ్లగుంట వద్ద రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు... పెట్లూరు గ్రామానికి చెందిన డి.మధు(18) వెంకటగిరికి వస్తున్నారు. వెంకటగిరి నుంచి నాయుడుపేట మండలం తుమ్మూరుకు చెందిన పి.కీర్తిరాజు, ఆయన భార్య శిరీషా నాయుడుపేట వైపు వెళ్తున్నారు. మొగళ్లగుంట వద్ద వీరి బైక్‌లు ఢీకొనడంతో మధు అక్కడిక్కడే మృతి చెందారు. కీర్తిరాజు, శిరీషా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాకి తరలించారు. మధు మృతదేహాన్ని వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్న ఆటో

ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 25: నాయుడుపేట - అన్నమేడు క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఆటో ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోవూరుకు చెందిన సంతోష్, సోయల్ తమ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తికి ఆటోలో వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయుడుపేట అన్నమేడు క్రాస్‌రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సోయల్, సంతోష్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడ్డ కిరణ్, సందీప్ - ప్రమాద దృశ్యం

దొరవారిసత్రం, జూన్ 25: మండలంలోని కుప్పారెడ్డిపాళెం సమీపంలో దాబా వద్ద మంగళంవారం సాయంత్ర జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వాకాడుకు చెందిన పి.కిరణ్, ఆయన ఐదేళ్ల కుమారుడు సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో ఉన్న కిరణ్ తన కుమారుడితో కలిసి ఉగ్గుముడికి వెళ్ళేందుకు వాకాడు నుంచి దొరవారిసత్రం వచ్చాడు. దొరవారిసత్రం నుంచి వెదురుపట్టు రోడ్డులో రాంగ్ రూట్‌లో జాతీయ రహదారిపై తన బైక్‌లో ప్రయాణిస్తుండగా కారు ఢీ కొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు రహదారిపై పడిపోవడంతో కిరణ్‌కు కాలు విరిగింది. సందీప్‌కు తలకు బలమైన రక్త గాయమైంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. స్థానికపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, జూన్ 25: స్థానిక 31వ వార్డులో ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్వర్లు కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రూ.10వేలు అందజేశారు. ఈ నగదును టీడీపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి రాజేష్ బాధిత కుటుంబానికి అందజేశారు.

విద్యార్థులకు అసౌకర్యం కలిగిస్తే ఉపేక్షించేది లేదు


అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్

గూడూరు అర్బన్, జూన్ 25: ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలిగించే ఏలాంటి చర్యలను ఉపేక్షించబోనని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలను ఆయన డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి తనిఖీ చేశారు. గురుకులంలో నీటి వసతులను, గదులను ఆయ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకులంలో భోజనం సరఫరా చేసే కాంట్రాక్టరు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. రెండు రోజుల క్రితం చెన్నూరులో జరిగిన సంఘటన ఎక్కడైనా పునరావృతం అయితే ఉపేక్షించేదిలేదని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చెన్నూరు గురుకులంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన 20 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థులపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా మిగతా విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా సరిహద్దు జలాల్లోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు


తూపిలిపాళెం మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

వాకాడు, జూన్ 25: తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు సరిహద్దులు దాటి ఆంధ్రాలోకి ప్రవేశించి మత్స్యసంపదను దోచుకెళ్లడంపై ఇక్కడి గంగపుత్రులు నష్టపోతున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు అన్నారు. మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో మంగళవారం ఆయన మత్స్యకారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తమిళనాడు రాష్ట్రం నాగపట్టినం, కడలూరు, తూత్తుకుడి, పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన కారైక్కల్ ప్రాంతాల జాలర్లు ఆంధ్రా సరిహద్దుల్లోకి ప్రవేశించి వేట సాగించడంపై నాగపట్టినం అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్, చెన్నై ఫిష్ హార్బర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆంధ్రా సరిహద్దుల్లోకి ప్రవేశించే తమిళ జాలర్ల బోట్ రిజిస్ట్రేషన్, లైసెన్స్‌తోపాటు డీజిల్‌పై రాయితీని రద్దు చేస్తామని ఆ రాష్ట్ర అధికారులు తమకు చెప్పారన్నారు. ఇకపై తమిళ జాలర్లు ఆంధ్రా సరిహద్దుల్లోకి ప్రవేశిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన ఎఫ్‌డీవోలు రెడ్డినాయక్, రఘుబాబు తదితరులున్నారు.

గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా తిరిగి హనుమంతరావు

ఆదేశాలు జారీ చేసిన డీహెచ్

తిరుపతి(వైద్యం), జూన్ 25: రుయా డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ హనుమంతరావును తిరిగి గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీహెచ్) అధికారి పద్మావతి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. హనుమంతరావు.. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తూ ఏడు నెలల మెడికల్ సెలవుపై వెళ్లారు. ఈనెల 17వ తేదీతో సెలవులు ముగియడంతో ఆయన డీహెచ్‌ను కలవడంతో రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు. అయితే గతంలో పనిచేస్తున్న శాఖలో రిలీవ్ కాకుండా నేరుగా డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు స్వీకరించడంతోపాటు మెడికల్ లీవ్‌లో ఉన్న సమయంలో ప్రైవేటు మెడికల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేశారు. ఈ విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో వెంటనే డీహెచ్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలందాయి. దీంతో ఆయన మంగళవారం డీహెచ్‌ను కలవడంతో తిరిగి గూడూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమించారు. అలాగే ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారించాక, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆ ఆదేశాల్లోనే డీహెచ్ పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వోకు బదులు డీహెచ్ రిలీవ్ చేయవచ్చు

గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా తాను బాధ్యతలు స్వీకరించారనే విషయంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై డాక్టర్ హనుమంతరావు స్పందించారు. ఏడు నెలలు సెలవులో ఉన్న కారణం వల్ల తాను తిరిగి విధుల్లో చేరాలన్నా, రిలీవ్ కావాలన్నా డీఎంహెచ్‌వోకు రిపోర్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా డీహెచ్‌కు రిపోర్టు చేస్తే సరిపోతుందని, అలాగే తనను రిలీవ్ చేసే అధికారం డీహెచ్‌కు ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిల్వచేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు: ఆర్డీవో

సూళ్లూరుపేట, జూన్ 25: నిల్వచేసిన ఆహార పదార్థాలను వండితే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చంద్రముని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని హోటళ్లను, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. దాబాలు, హోటళ్ల, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిల్వచేసిన మాంసంతో పాటు నాసిరకం పదార్థాలు, నూనెను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. పరిసరాలు కూడా పరిశుభ్రంగా లేకపోవడంతో నిర్వాహకులపై మండిపడ్డారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

నెలలోగా 'గ్యాస్' గుంతలు పూడ్చండి

నిర్వాహకులకు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

నాయుడుపేట, జూన్ 25: మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో గ్యాస్ సరఫరా కోసం సిమెంటు రోడ్లను పగులగొట్టిన నిర్వాహకులు నెల రోజుల్లో మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం గ్యాస్ పైపులైను ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. పైపు లైన్ల కోసం ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లను ధ్వంసం చేయడంతో తాగునీటి పైపులు దెబ్బతింటున్నాయన్నారు. దీంతో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులకోసం గ్యాస్ పైపు లైన్ యాజమాన్యం రెండు దఫాలుగా రూ.2.26 కోట్లు బ్యాంక్ ఇచ్చిందని మున్సిపల్ వైస్‌చైర్మన్లు షేక్ రఫీ, వెంకటకృష్ణారెడ్డి పైపులైన్ ప్రతినిధులకు గుర్తుచేశారు. గ్యాస్ సంస్థ ఏజీఎం అనిల్‌కుమార్, చీఫ్ మేనేజర్ చాణిక్య మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలో 84 కిలోమీటర్ల మేర గ్యాస్ లైన్ వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 48 కిలోమీటర్లు పూర్తయ్యిందన్నారు. ఇకపై తప్పకాలు జరపమన్నారు. గతంలో తవ్విన గుంతలను నెలలోగా మరమ్మతులు పూర్తి చేస్తామంటూ హామీ పత్రాన్ని అందజేశారు.

ఆలయ కమిటీలో అవకాశం కల్పించండి



నాయుడుపేట టౌన్, జూన్ 25: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను దాసరి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ టి.అప్పారావు సన్మానించారు. నియోజకవర్గంలోని చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం, నాయుడుపేట పట్టణంలోని పోలేరమ్మ దేవస్థాన ఆలయ కమిటీల్లో దాసరి కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈ.వెంకటేశ్వర్లు, బాబు, వెంకటేష్, వంశీ, చెంగయ్య, హరిబాబు, నరసింహులు, ధనరాజు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం



సూళ్లూరుపేట, జూన్ 25: సూళ్లూరుపేట నుంచి పులికాట్ పల్లెలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం సూళ్లూరుపేట నుంచి కొరిడి-పేర్నాడు వెళ్తున్న ఆర్టీసీ మార్గమధ్యంలో కొరిడి సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌కు సైడ్ ఇవ్వబోయి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఒరిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సును నిలిపివేయంతో ప్రమాదం తప్పింది. డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ తాకిడికి కొరిడి-పేర్నాడు రోడ్డు కోతకు గురైంది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదం జరిగింది.

రైతులకు న్యాయం జరిగేలా చర్యలు


రైతులతో చర్చిస్తున్న తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు, జూన్ 25: సాగరమాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన మండలంలోని ఉడతావారిపాల్లపల్లికి చెందిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. కోల్పోయిన భూముల వద్ద టెంటు ఏర్పాటు చేసుకుని నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న రైతులతో మంగళవారం తహసీల్దారు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారి భూములకు సంబంధించిన రికార్డులను అందజేయాలన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు అందించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమ్య, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

స్వామివారికి వేడుకగా వసంతోత్సవం

చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గూడూరు, జూన్ 25: పట్టణంలోని రాజా వీధిలో కొలువైవున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసమూర్తికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం చక్రస్నానం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూర్ణాహుతి జరిగింది. రాత్రికి ధ్వజావరోహణం చేపట్టారు.

ఎమ్మెల్యేకు పలువురి అభినందనలు



గూడూరు అర్బన్, జూన్ 25: నియోజకవర్గంలోని పలువురు అధికారులు, నాయకులు, వివిధ అసోసియేషన్ల నాయకులు, సంస్థల సభ్యులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పాశిం సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. అందరి సహకారంతో నియోజకర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట/ పెళ్లకూరు, జూన్ 25: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండలంలోని కోటపోలూరులో పారిశుధ్య పనులు చేయించారు. అతిసారాపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. పెళ్లకూరు మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మంగళవారం పెళ్లకూరు పట్టణంలోని తాగునీటి బావి, కొళాయిలు, వీధుల వెంబడి చెత్తచెదారాలు తొలగించి క్లోరినేషన్ చేయించారు.

మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం

బర్డ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కిషోర్ కుమార్

తిరుపతి, జూన్25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు యథావిధిగా జరుగుతున్నాయని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్డ్‌లో ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిలిపేశారన్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. రోగులకు సూచించిన అపాయింట్‌మేరకు ఉచితంగా అన్ని రకాల ఆర్థో ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. రోగులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సీఎస్ఆర్ఎంవో కోరారు.

రహదారి భద్రతా నియమాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కోట, జూన్ 25 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు రహదారి భద్రతా నియమాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 4వ వార్షిక శిక్షణ శిబిరం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు జిల్లాల నుంచి వచ్చిన క్యాడెట్లకు ఆయుధ శిక్షణ ఇచ్చారు. గేమ్స్, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ నాగబాబు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. బాల్యం నుంచే ప్రతి ఒక్కరు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జి.నరేంద్రబాబు, నాగరాజు, పెంచలయ్య, మస్తానయ్య, లక్ష్మీనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకలపై విచారణ జరిపించండి


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాలో ఊనుగుంటపాళెంవాసులు

కోట, జూన్ 25: మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరపించాలని గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఊనుగుంటపాళెం పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పనులకు రానివారికి కూలీ జమ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆయనకు ఇష్టం వచ్చిన వారికి ఎక్కువగా డబ్బులు వేస్తున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే పనులకు వచ్చినప్పటికీ పైసా కూడా బ్యాంక్ ఖాతాలో జమ చేయడం లేదన్నారు. తమ గ్రామంలో గతంలో అమృత్ సరోవర్ కింద లక్షల రూపాయలతో ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు. ఆ పనులన్నీ లోప భూయిష్టమన్నారు. భారీగా అవకతవకలు జరిగి లక్షలాది రూపాయలు పక్కదారి పట్టాయన్నారు. దీనిపై తక్షణం విచారణ జరిపించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేసి వినతిపత్రాన్ని ఆ పథకం ఏపీవో పూర్ణిమకు అందజేశారు. ఏపీవో మాట్లాడుతూ ఊనుగుంటపాళెం సీనియర్ మేట్‌ను విధుల నుంచి తొలగిస్తున్నామన్నారు.

మాదక ద్రవ్యాలను అడ్డుకుందాం


అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హరికృష్ణ

కోట, జూన్ 25: మాదక ద్రవ్యాల మహమ్మారిని అవగాహనతో తరిమికొడదామని వాకాడు సీఐ హరికృష్ణ పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో మంగళవారం వాకాడు సెబ్ అధికారుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో అలాంటి మాదక ద్రవ్యాల అలవాటు పడవద్దన్నారు. చదువుకునే వయసులో విజ్ఞానంపై మక్కువ పెంచుకోవాలని ప్రాణాలను హరించే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ నాగబాబు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తదితరులు ఉన్నారు.

అదనపు కట్న వేధింపులపై కేసు

కోట, జూన్ 25: మండలంలోని విద్యానగర్‌కు చెందిన షరీఫా తన భర్త ఫిరోజ్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేయడంలో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. వాకాడు మండలం సాయిబులపాళెంకు చెందిన ఫిరోజ్‌కు కోట మండలం విద్యానగర్‌కు చెందిన షరీఫాతో 6 నెలల క్రితం వివాహం జరిగింది. పుట్టింటి నుంచి అన్ని లాంఛనాలు ఇచ్చినప్పటికీ తన భర్త, కుటుంబీకులు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాంటూ ఫిర్యాదు చేశారు.

ఉదయం ఎండ... సాయంత్రం చినుకులు

● భిన్నమైన వాతావరణం

తడ, జూన్ 25: వానలు కురవాల్సిన సమయంలో భిన్నమైన వాతావరణం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం ఎండకాస్తుంటే... సాయంత్రం మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు కురుస్తున్నాయి. పది రోజులుగా ఇదే విధంగా వాతావరణం నెలకొని ఉంది. తెల్లవారుజాము నుంచి మాడు పగలగొట్టే ఎండ కాస్తూ... మధ్యాహ్నం వరకు ఇబ్బంది పెడుతోంది. సాయంత్రానికి మబ్బులు కమ్ముకుంటాయి. సన్నటి జల్లు కురిసి మబ్బులు మాయమైపోతున్నాయి. ఆ తరువాత గాలి వీయక ఉక్కపోత ఉంటోంది. ఈ భిన్నమైన వాతావరణంలో రాత్రి గడిచేకొద్ది అటు ఇళ్లల్లో ఉండలేక, బయట చల్లగాలిలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటువంటి వాతావరణ పరిస్థితులను ఎప్పుడు చూడలేదని జనం అనుకుంటున్నారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, జూన్ 25: గూడూరులో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లోని మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. నాలుగు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిని గూడూరువాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు.

మిగిలి ఉన్న సీట్ల భర్తీకి 27న ప్రవేశపరీక్ష

వాకాడు, జూన్ 25: మండలంలోని అంబేద్కర్ గురుకులంలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వాకాడు గురుకులంలో ప్రవేశం లభిస్తుందన్నారు.